

ఆలస్యంగా ఎస్జీటీల బదిలీ కౌన్సెలింగ్



బదిలీ కౌన్సెలింగ్ కోసం చిత్తూరు షర్మన్ స్కూల్లో చెట్ల కింద వేచివున్న టీచర్లు

చిత్తూరు సెంట్రల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా మూడు రోజుల విరామం తర్వాత మంగళవారం రాత్రి సెంకడరీ గ్రేడ్ టీచర్ల (ఎస్జీటీ)ల బదిలీ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలైంది. చిత్తూరులోని షర్మన్ మెమోరియల్ బాలికల పాఠశాలలో రాత్రి 10.50గంటలకు కౌన్సెలింగ్ మొదలు పెట్టారు.డీఈవో వరలక్ష్మి ఎస్జీటీలకు బదిలీ పత్రాలను అందజేశారు.మంగళవారం సాయంత్రం 3.50 గంటలకు కౌన్సెలింగుకు హాజరు కావాలని విద్యాశాఖ అధికారులు సూచించినా, రాష్ట్రస్థాయి నుంచి ఖాళీలకు సంబంధించి అధికారిక జాబితా రాకపోవడంతో కౌన్సెలింగ్ ఆలస్యమైంది.మొత్తం 3,577మంది ఎస్జీటీలు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు.వీరిలో జడ్పీ, మండల పరిషత్ యాజమాన్యాల్లో 3190మంది టీచర్లుండగా, ప్రభుత్వ యాజమాన్యంలో నలుగురు, మున్సిపల్ యాజమాన్యంలో 214మంది, మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యంలో 169 మంది ఉన్నారు. తొలి దశలో 350మందికి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.బుధవారం ఉదయం 10గంటలకు 351నుంచి 700వరకూ, మధ్యాహ్నం మూడు గంటలకు 701నుంచి 1000మంది ఎస్జీటీల వరకూ బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. తిరుపతి డీఈవో కుమార్, ఏడీలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.



బదిలీ పత్రాన్ని అందజేస్తున్న డీఈవో వరలక్ష్మి

కుప్పం రెడ్డెమ్మ అవార్డుల ప్రదానం రేపు

చిత్తూరు కల్చరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని డీఐ రోడ్డు రాజామహల్ హోటల్‌లో గురువారం కుప్పం రెడ్డెమ్మ సాహితీ అవార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కె.రోజాప్రియ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పద్మా దాశరథి రచించిన సాహచర్య బంధం, డి.ఎస్.సుబ్రమణ్యం రచించిన అగ్రిమెంట్, అల్లూరి గౌరీలక్ష్మి రచించిన మలిసంజ కెంజాయ, శాంతి జయప్రకాష్ రచించిన అదృశ్యసంకెళ్లు నవలలు అవార్డులకు ఎంపికయ్యాయని ఆమె తెలిపారు. పోటీల్లో గెలుపొందిన రచయితలకు రూ.10 వేల నగదు అందించి సత్కరించనున్నట్లు సంస్థ కార్యదర్శి డాక్టర్ నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు.

200మంది పంచాయతీ కార్యదర్శులకు బదిలీలు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పలు గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల్లో 200 మందిని బదిలీ చేస్తూ సోమవారం రాత్రి కలెక్టర్ సుమిత్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. గ్రేడ్-1లో 10 మంది, గ్రేడ్-2లో 31 మంది, గ్రేడ్-3 75 మంది, గ్రేడ్-4లో 84 మంది బదిలీ అయ్యారు.

పిల్లలకు పుస్తకాలు సిద్ధం

రేపే పాఠశాలల పునఃప్రారంభం



బంగారుపాళ్యంలో స్టాక్ పాయింట్లకు చేరిన పాఠ్యపుస్తకాలు



పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1949	52,469
ప్రాథమికోన్నత	158	10,293
ఉన్నత	355	85,668
మొత్తం	2462	1,48,430

● విద్యార్థులకు అందించే కిట్ వివరాలు

కిట్‌లోని వస్తువులు	అవసరం	వచ్చినవి	రావాల్సినవి
పాఠ్యపుస్తకాలు-వర్క్‌బుక్స్	15,87,618	15,71,868	15,750
నోట్‌బుక్స్	8,36,872	8,36,872	-
బ్యాగులు	1,44,400	1,26,604	17,796
యూనిఫాం	1,44,400	67,800	76,600
షూస్	1,44,189	-	1,44,189
బెల్టులు	1,03,563	1,03,563	-
ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ(6వ తరగతి)	12,771	12,771	-
ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ(1వ తరగతి)	24,728	24,728	-

చిత్తూరు సెంట్రల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : సెలవుల్లో హాయిగా ఆడుతూ పాడుతూ గడిపిన చిన్నారులు రేపట్నుంచీ బడిబాట పట్టనున్నారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' పేరుతో స్టూడెంట్ కిట్స్ ఉచితంగా అందజేయనుంది.జిల్లాకు చేరిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, వర్క్‌బుక్స్, బ్యాగులు, తదితర సామగ్రిని విద్యార్థులకు అందించేందుకు విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు.ఎంఈవోల ద్వారా మండల కేంద్రాల నుంచి పాఠశాలలకు తరలించి పంపిణీకి సిద్ధం చేశారు.

బార్ కోడ్‌తో పంపిణీ: విద్యార్థులకు ఇచ్చే కిట్లు, ఇతర వస్తువులు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం ఈ ఏడాది కొత్తగా బార్ కోడ్ సిస్టమ్ అమలు చేస్తోంది. షూలు, బెల్టులు, బ్యాగులకు బార్ కోడ్‌లు ఉన్నాయి. విద్యార్థి శారీరక దృఢత్వానికి అనుగుణంగా బ్యాగులను మూడు రకాలుగా విభజించి, మూడు రంగుల్లో ఇవ్వనున్నారు. ఒకటి, రెండు తరగతులకు(స్మాల్ బ్యాగ్) ప్యారెట్ గ్రీన్, మూడు నుంచి ఐదు తరగతులకు(మీడియం బ్యాగ్) పింక్, ఆరు నుంచి టెన్త్ వరకు (లార్జ్ బ్యాగ్) పచ్చరంగు బ్యాగులు ఇవ్వనున్నారు.ఒకటి నుంచి టెన్త్ వరకు ప్రతి విద్యార్థికీ మూడు జతల యూనిఫాం, ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థినులకు బెల్టు, ఒకటి నుంచి టెన్త్ వరకు విద్యార్థులకు బెల్టు, ఆరు నుంచి టెన్త్ వరకు నోట్ పుస్తకాలు, ఒకటి నుంచి టెన్త్ వరకు పాఠ్య పుస్తకాలు, ఒకటి నుంచి ఐదవ తరగతి విద్యార్థులకు వర్క్‌బుక్స్, ఒకటి నుంచి టెన్త్ వరకు విద్యార్థులకు స్కూల్ బ్యాగులు ఇవ్వనున్నారు.

తొలి రోజే పాఠ్యపుస్తకాలు అందజేస్తాం



31 స్టాక్ పాయింట్ల నుంచి జిల్లాలోని ప్రతి పాఠశాలకూ పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, కిట్లు పంపిణీ చేశాం. పాఠశాలల పునఃప్రారంభం రోజే సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కింద పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు క్యూఆర్ కోడ్ ద్వారా అందించనున్నాం. రావాల్సినవి రెండు రోజుల్లో జిల్లాకు చేరుకుంటాయి. వీటితో పాటు మూడు జతల యూనిఫాం అందించనున్నాం.

\- వెంకటరమణ, ఏపీసీ, సమగ్రశిక్ష

మహిళాగ్రహం

● అమరావతి మహిళలను కించపరచడంపై చర్యలు తీసుకోవాలంటూ ర్యాలీలు



చిత్తూరులో తెలుగు మహిళల ర్యాలీ

చిత్తూరు సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి):అమరావతి ప్రాంత మహిళలను కించపరిచేలా సాక్షి ఛానెల్ డిబేట్‌లో కారుకూతలు కూసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని చిత్తూరులో మంగళవారం తెలుగుమహిళలు పెద్దఎత్తున నిరసన తెలిపారు. నాగయ్య కళాక్షేత్రం నుంచి ఎమ్మెస్సార్ సర్కిల్ మీదుగా ర్యాలీ నిర్వహించిన మహిళలు గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు కేఎస్ఆర్, కృష్ణంరాజు, వైసీపీ సలహాదారు సజ్జల రామకృష్ణా రెడ్డి చిత్రపటాలను ,సాక్షి పత్రికలను తగులబెట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు మహిళలు మాట్లాడుతూ అమరావతిని అడ్డుకునేందుకు మాజీ సీఎం జగన్ రెడ్డి సాక్షి మీడియాలో తన అనుచరులతో ఇలా కారుకూతలు కూయిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి వారిని ప్రోత్సహిస్తున్న సాక్షి చానల్‌ను ఆపివేయాలని ప్రభుత్వాన్ని కోరారు.టీడీపీ చిత్తూరు పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు కాజాల అరుణ, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మేయర్ అముద, విక్టోరియా, వరలక్ష్మి, నాగలక్ష్మి, ప్రతిభ, ఉదయ, అను, భువనేశ్వరి, పద్మ, రేవతి, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

జగన్ మీడియా పైశాచికత్వం అమానుషం



కుప్పంలో జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న తెలుగు మహిళలు

కుప్పం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమరావతి మహిళలపై అనుచితంగా కారుకూతలు కూసి వారి శీల హననానికి ఒడిగట్టిన సాక్షి మీడియా పైశాచికత్వం అమానుషమైనదని తెలుగు మహిళలు ధ్వజమెత్తారు. సాక్షి మీడియాను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కుప్పంలో మంగళవారం తెలుగు మహిళలు పెద్దయెత్తున ర్యాలీ నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంనుంచి ప్రారంభమైన ర్యాలీ ఆర్టీసీ బస్టాండు కూడలి దాకా సాగింది. ఇక్కడ మానవహారంగా ఏర్పడ్డ తెలుగు మహిళలు, జగన్ మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే జగన్ మీడియాను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మహిళల శీల హననానికి పాల్పడే హీనమైన వ్యాఖ్యలు ఇంకెవరూ చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నీచ వ్యాఖ్యలకు బాధ్యులైన కొమ్మినేని శ్రీనివాస్, కృష్ణంరాజులకు చట్టపరంగా తీవ్ర దండన విధించాలని డిమాండ్ చేశారు. సాక్షి మీడియా, జగన్‌రెడ్డి దిష్టిబొమ్మలను చెప్పులతో దండించి దహనం చేశారు.

గుజ్జు ఫ్యాక్టరీల్లో కలెక్టర్ తనిఖీలు



ఫ్యాక్టరీ వద్ద రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్/గుడిపాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మామిడి గుజ్జు పరిశ్రమలకు తోతాపురి రకం మామిడి తీసుకొచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాత్రి జేసీ విద్యాధరి, ఉద్యాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరెడ్డి,ఆర్డీవో శ్రీనివాసులుతో కలిసి గుడిపాల మండలంలోని ఫుడ్ ఇన్స్‌టాఫొ, గంగాధరనెల్లూరు మండలంలోని జైన్ మామిడి గుజ్జు ఫ్యాక్టరీలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మామిడి రైతులతో మాట్లాడి ఫ్యాక్టరీల వద్ద ఇబ్బందులేమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రోజుకు 80 మంది రైతులకు టోకెన్లను ఇస్తున్నారని, ఆ సంఖ్యను వంద వరకు పెంచే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులందరి కాయలను తీసుకుంటామని, అదే సమయంలో పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే ఫ్యాక్టరీకి తీసుకురావాలని రైతులకు కలెక్టర్ సూచించారు. గుజ్జు ఫ్యాక్టరీల వద్ద మంగళవారం నుంచీ సీజన్ పూర్తయ్యేంతవరకు షిఫ్టులవారీగా పనిచేసేవిధంగా నియమించిన ఉద్యోగ బృందాలు ఉన్నాయో లేదో కలెక్టర్ పరిశీలించారు. ఫ్యాక్టరీలకు మామిడిని చేరవేసిన రైతుల వివరాలను నమోదు చేసిన రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు.

చిత్తూరు యార్డుకు 350 టన్నుల మామిడి



వాహనాల్లో మార్కెట్ యార్డుకు చేరుతున్న మామిడి

చిత్తూరు సెంట్రల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మామిడి మార్కెట్ యార్డుకు మంగళవారం 350 టన్నుల మామిడి వచ్చింది.తోతాపురి, బేనీషా, కాలేపాడ్ రకాల మామిడిని యార్డుకు చుట్టుపక్కల ప్రాంతాల రైతులు తరలించారు. తోతాపురి కిలో రూ.12 నుంచి రూ.15 ధర పలకగా, బేనీషా కిలో రూ.15 నుంచి రూ.20, కాలేపాడ్ కిలో రూ.20 నుంచి రూ.30 ధర పలికింది. నాణ్యమైన మామిడి కాయలను మండీ యాజమానులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

ఏటీవో సహా తొమ్మిదిమంది ఎస్టీవోల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఖజానా శాఖలో పలువురిని జోన్-4 పరిధిలో బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం అర్ధరాత్రి ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాకు సంబంధించి అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ హరినాథ్‌ను అనంతపురం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా బదిలీ చేస్తూ, ఆయన స్థానంలో కర్నూలు జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న అనిల్‌కుమార్‌ను నియమించింది. సబ్ ట్రెజరీ ఆఫీసర్లవారీగా తిరుపతిలో పనిచేస్తున్న పి. శోభారాణిని చిత్తూరుకు, చిత్తూరులో పనిచేస్తున్న ఆర్. శ్రీవాణిని తిరుపతి జిల్లాకు బదిలీచేశారు. కుప్పం ఎస్టీవో ఎస్. మహబూబ్ బాషాను పుంగనూరుకు, పుంగనూరులో పనిచేస్తున్న పి. పద్మనాభాన్ని చిత్తూరు ఖజానా డీడీ కార్యాలయానికి, చిత్తూరులో పనిచేస్తున్న పి. చెంగల్రాయను తొట్టంబేడుకు, చిత్తూరు సబ్‌ట్రెజరీలో పనిచేస్తున్న ఎస్టీవో బి. నరేష్‌ను మదనపల్లెకు బదిలీచేశారు. సత్యవేడులో పనిచేస్తున్న ఎస్. గోకులేంద్ర ప్రసాద్‌ను కుప్పానికి, పలమనేరులో పనిచేస్తున్న బి. రామకృష్ణను కదిరికి, కదిరిలో పనిచేస్తున్న కిరణ్‌ను పలమనేరుకు ప్రభుత్వం బదిలీచేసింది. వీరందరూ వెంటనే బదిలీ చేసిన స్థానాలకు వెళ్ళి రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

వ్యవసాయ అనుబంధ శాఖల్లో బదిలీలు

చిత్తూరు సెంట్రల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల్లో పలువురు అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగరి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం.సౌభాగ్యలక్ష్మిని తిరుపతి జిల్లా ట్రైనింగ్ సెంటర్‌కు బదిలీ చేశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌లో ఏడీఏగా పనిచేస్తున్న జి.వాసును చిత్తూరు జిల్లా వ్యవసాయ ట్రైనింగ్ సెంటర్‌కు, పలమనేరు అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ డి.అన్నపూర్ణను కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు సీడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు బదిలీ చేశారు. ఉద్యాన శాఖలో ప్రకాశం జిల్లా ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న పీవీ రమణను చిత్తూరు జిల్లా ఏపీఎంఐపీ పీడీగా బదిలీ చేశారు. ఇక్కడ ఏపీఎంఐపీ పీడీగా పనిచేస్తున్న ఎస్ఏ బాలసుబ్రమణ్యంను శ్రీశైలం ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీకి బదిలీ చేశారు. జిల్లా పట్టుపరిశ్రమ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎస్. శోభరాణిని పరిపాలన సౌలభ్యం కింద శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి జిల్లా పట్టుపరిశ్రమ అధికారిగా బదిలీ చేయగా, అక్కడ పనిచేస్తున్న డి.పద్మమ్మ జేడీగా చిత్తూరు పట్టు పరిశ్రమ శాఖకు రానున్నారు.

రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీకి ప్రత్యేక ఉద్యోగోన్నతి



చిత్తూరు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు, తిరుపతి రిజిస్ట్రేషన్ జిల్లాల డీఐజీగా పనిచేస్తున్న గిరి బాబుకు ప్రభుత్వం ప్రత్యేక ఉద్యోగోన్నతి (స్పెషల్ ప్రమోషన్ పోస్ట్) కల్పిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆయన డీఐజీ హోదాలో 12 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న నేపథ్యంలో ఈ మేర ఉద్యోగోన్నతి కల్పించింది. డీఐజీకి ఉద్యోగోన్నతి రావడం పట్ల పలువురు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసర్లు హర్షం వ్యక్తం చేశారు.

జడ్పీ డిప్యూటీ సీఈవోగా వెంకటనారాయణ



చిత్తూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా వెంకటనారాయణను ప్రభుత్వం నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్న జుబేదా డ్వామా శాఖ కడప జిల్లా విజిలెన్స్ అధికారిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో తిరుపతి తుడా కార్యదర్శి వెంకటనారాయణను నియమించారు. ఆయన మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహనకు స్లో మోటార్‌సైకిల్ రైడింగ్

చిత్తూరు అర్బన్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిల్ నడిపే వారిలో సహనాన్ని, వాహనాన్ని బ్యాలెన్స్ చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడానికి స్లో మోటార్ సైకిల్ రైడింగ్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మణికంఠ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వంద మీటర్ల దూరాన్ని స్టార్టింగ్ లైన్ నుంచి ఎండింగ్‌లైన్ వరకు కాలు కింద పెట్టకుండా ఎవరూ టచ్ చేస్తారో వారిని ఆ రౌండ్ విన్నర్‌గా ప్రకటిస్తారన్నారు. ప్రతి బ్యాచ్‌లో కొంతమందిని ఎంపిక చేసి పోటీలు నిర్వహిస్తారన్నారు. మూడు రౌండ్లలో విన్నర్‌గా నిలిచిన వారిని విజేతలుగా ప్రకటించి నగదు బహుమతులను ప్రదానం చేస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు చిత్తూరు ట్రాఫిక్ సీఐ వాట్సప్ నెంబరు 9491074515 నెంబరుకు వివరాలు పంపి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. త్వరలో తేదీని ప్రకటిస్తామన్నారు.



కడసారి కష్టాలు

కేవీబీపురం మండలం వగత్తూరు గ్రామంలో మరణించిన వారిని కాటికి తీసుకెళ్లడానికి కడసారి కష్టాలు తప్పడం లేదు. గ్రామం ఏర్పడి 70 సంవత్సరాలవుతున్నా ఇప్పటికీ శ్మశానానికి దారి లేక గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. పొలాల మీదుగా పాడె మోసుకెళ్లే దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా కార్యాలయాలు చుట్టూ తిరిగినా శ్మశానానికి దారి ఏర్పాటు చేయలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే స్పందించి తమ శ్మశానానికి దారి ఏర్పాటు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

- కేవీబీపురం, ఆంధ్రజ్యోతి

తిరుమల అడవుల్లో అగ్నిప్రమాదం

తిరుమల శేషాచల అడవుల్లో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. శ్రీవారిపాదాల మార్గంలోని అడవిలో ఒక్క సారిగా మంటలు చేలరేగాయి. ఈక్రమంలో వాహనదారులు, భక్తులు గమనించి వెంటనే ఫారెస్ట్, ఫైర్ సిబ్బందిని అప్ర మత్తం చేశారు. రెండు ఫైర్ ఇంజిన్లలో మంటలను అదుపు చేశారు. . స్వల్పంగా మంటలు చేలరేగాయని, సకాలంలో అధికారులు, సిబ్బంది స్పందించడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదని టీటీడీ పేర్కొంది.



- తిరుమల, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ ఏటీసీ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.90 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,258

తలనీలాలు సమర్పించినవారు: 33,502



'కింగ్‌డమ్'ను ఆదరించండి

- సినీనిర్మాత నాగవంశీ -



తిరుమల, జూన్10 (ఆంధ్రజ్యోతి): విజయ్ దేవరకొండ 'కింగ్‌డమ్' చిత్రం జూలై నెలలో విడుదలకు సిద్ధంగా ఉందని, తప్పకుండా అందరు చూసి ఆదరించాలని కోరుకుంటున్నానని ఈ చిత్ర నిర్మాత నాగవంశీ తెలిపారు. రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో కలిసి ఆయన మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయం ముందు నాగవంశీ మీడియాతో మాట్లాడుతూ.. సోమవారం తనవి రెండు చిత్రాల షూటింగ్ మొదలైందన్నారు. ఈసందర్భంగా శ్రీవారి ఆశీస్సుల కోసం వచ్చినట్టు వెల్లడించారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు



కోన రవికుమార్, సభ్యులు

తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఏపీ శాసనసభ పబ్లిక్ సెక్టార్ అండర్ టేకింగ్ కమిటీ చైర్మన్ కోనా రవికుమార్, సభ్యులు, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస హరీశ్‌కుమార్, ఎమ్మెల్యేలు వసంత కృష్ణప్రసాద్, వర్ల కుమార్‌రాజు, తెలంగాణ శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి, ఎమ్మెల్సీ అంజిరెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ శ్రీనివాస హరీశ్‌కుమార్

ఎస్వీయూ యూజీ 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాల విడుదల

తిరుపతి(విద్య), జూన్ 10(ఆంధ్రజ్యోతి): శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో 6వ సెమిస్టర్ సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్టు వర్సిటీ డీన్ ఆచార్య కొంగర సురేంద్రబాబు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో యూజీ సప్లిమెంటరీ 6వ సెమిస్టర్ పరీక్షలు జరిగాయని, వాటికి సంబంధించిన ఫలితాలను ఆన్‌లైన్‌లో ఉంచినట్టు ఆయన వెల్లడించారు.విద్యార్థులు results.manabadi.co.in లింక్ ద్వారా ఫలితాలను చూడవచ్చని తెలియజేశారు.

తిరుపతి కార్పొరేషన్ పరిధి పెరగాలి

- 53వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పూర్తిచేస్తాం
- శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్ రవికుమార్



తిరుపతి, జూన్10(ఆంధ్రజ్యోతి): 'తిరుపతి కార్పొరేషన్ పరిధి పెంచాల్సిన అవసరముంది. అందుకు ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతాం' అని శాసనసభ పబ్లిక్ అండర్ టేకింగ్స్ కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం తిరుపతిలోని శ్రీ పద్మావతి సమావేశ మందిరంలో ఏపీ ఎస్పీడీసీఎల్, తిరుపతి స్మార్ట్ సిటీ, టూరిజం, టీటీడీ విభాగాలపై ఆయన సమీక్షించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ విభాగాలపై త్వరలో లోతుగా చర్చించి, అన్ని నివేదికలను స్పీకర్ ముందుంచి లోటుపాట్లను సవరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే మూడు నెలల్లో కొత్తగా 53 వేల వ్యవసాయ సర్వీసులు పూర్తి చేస్తామన్నారు. మరికొన్ని 33/11 కేవీ సబ్ స్టేషన్లను గడువులోపు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్మార్ట్ సిటీకి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన గడువు మార్చికి ముగిసిందని, పనులన్నీ త్వరలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గత మూడు ఆర్థిక సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వ వాటా 50 శాతం కూడా విడుదల చేయలేదని, కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన 2ఆర్థిక సంవత్సర నిధులు పెండింగ్‌లో పెట్టడంతో పనులు నిలిచాయన్నారు. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం చాలా వరకు భూములు కేటాయించిందని, ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ప్రాజెక్టులను వినియోగంలోకి తెచ్చి ఆదాయ మార్గాలను వెతకాలని సూచించారు. రాష్ట్రంలో 16 ఏళ్ల తర్వాత పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీ తొలిసారిగా పనిచేయడం ప్రారంభించిందన్నారు. ఇది స్టాట్యూటరీ కమిటీ అని, సభ్యులందరూ అందరికీ సుపరిచితులేనని అన్నారు. పబ్లిక్ అండర్ టేకింగ్ కమిటీల్లో 186 కంపెనీలు ఉన్నాయని వివరించారు. ఈ కమిటీ తాలూకు విధివిధానాలను పరిశీలిస్తే అన్ని కంపెనీలకు సంబంధించి రివ్యూ చేయొచ్చన్నారు. కంపెనీ పర్ఫామెన్స్, ఆడిట్ రిపోర్ట్, ఎఫిషియన్సీ, కంపెనీ చట్టం ప్రకారం ఏర్పడినటువంటి కంపెనీలు, సొసైటీ చట్టం ప్రకారం ఏర్పడిన కార్పొరేషన్లకు సంబంధించిన ప్రతి కంపెనీ వార్షిక నివేదికలు అసెంబ్లీలో పొందుపరచాలన్నారు.

వెనామీకి వైట్ పీకల్





వైట్ పీకల్‌తో చనిపోయి ఉన్న రొయ్యలు - కోట మండలం కొత్తపట్నంలో వైట్ పీకల్ సోకిన రొయ్యలను విక్రయానికి సిద్ధం చేస్తున్నరైతులు

- లక్షల్లో చనిపోతున్న రొయ్య పిల్లలు
- ఆక్వా రైతులను నిలువునా ముంచుతున్న వాతావరణ మార్పు

కోట, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పు, ఉష్ణోగ్రతలో తేడా ఆక్వా రైతులను నిలువునా ముంచుతోంది. వెనామీ రొయ్యలకు వైట్ పీకల్ (తెల్లపారుడు) వ్యాధి సోకి లక్షల్లో పిల్లలు చనిపోతుండడంతో రైతులు లబోదిబో మంటున్నారు. సముద్రతీర ప్రాంతమైన కోట మండలంలో ప్రధానంగా వెనామీ రొయ్యలు సాగును చేస్తున్నారు. కొత్తపట్నం, శ్రీనివాసనత్రం, వావిళ్ల దొరువు, గోవిందపల్లి, దొరువుకట్ట ప్రాంతాల్లో రొయ్యలకు వైట్ పీకల్ వ్యాధి సోకి పిల్లలు చనిపోతున్నాయి. ఇదే అదునుగా బయ్యర్లు అడిగిన రేటుకు రొయ్యలను విక్రయించాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● వైట్ పీకల్ లక్షణాలు

వెనామీ రొయ్య పిల్లలు 25నుంచి 30 డిగ్రీల ఉష్ణోగ్రతను తట్టుకోగలుగుతాయి. అయితే రెండు రోజులు ముందు 40నుంచి 50 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడం, ప్రస్తుతం వాతావరణం చల్లబడడంతో వైట్ పీకల్ వ్యాధి సోకింది. దీంతో రొయ్యలు మేత తినకుండా రోజురోజుకు బలహీన పడి ఎదుగుదల ఆగిపోతోంది. ఊపిరాడక గంటల వ్యవధిలోనే చనిపోతున్నాయి. సాధారణంగా వెనామీ రొయ్యలకు మూడు నుంచి పది గ్రాముల బరువు వరకు వైట్ పీకల్ సోకుతుంది. ప్రస్తుతం పది గ్రాముల సైజులో కూడా వైట్ పీకల్ సోకుతుండడంతో రైతులు లబోదిబో మంటున్నారు.



బాలకృష్ణ పుట్టినరోజున తిరుమలలో 650 టెంకాయల సమర్పణ

తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా మంగళవారం టీడీపీ నాయకులు తిరుమల శ్రీవారికి 650 కొబ్బరికాయలు సమర్పించారు. పార్టీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ ఆధ్వర్యంలో ఉదయం అఖిలాండం వదఆరున్నర కిలోల కర్పూరం వెలగించి, 650 కొబ్బరికాయలు సమర్పించారు. నందమూరి బాలకృష్ణ ఆరోగ్యంగా ఉండాలని, ప్రజలకు ఇంకా మెరుగైన సేవలు అందించాలని శ్రీవారిని కోరుకుంటూ కొబ్బరికాయలు సమర్పించామని శ్రీధరవర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో రూపేష్ వర్మ, సుబ్బు పాల్గొన్నారు.

అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొడుతున్న శ్రీధర్‌వర్మ, నేతలు

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై

అభయ హస్తాధీశుడి కటాక్షం

వడమాలపేట, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామివారు దేవేరులతో కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై అభయ హస్తాధీశుడిగా ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివార్లను మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం స్వామివారు స్వర్ణభరణాలతో సర్వాలంకార భూషితుడిగా పద్మావతీ, ఆండాల్ సమేతంగా రాజమన్నార్ అలంకారంలో మాడవీధుల్లో ఊరేగారు. అనంతరం ఉభయ నాంచారులతో ప్రసన్న వేంకటేశ్వరుడికి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి సర్వాభూపాలురలను వాహనంగా చేసుకొన్న ప్రసన్న వేంకటేశ్వరుడు ప్రసన్నవదనంతో మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకుల వేదమంత్రాలతో మాడవీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.





కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై దేవేరులతోకలిసి ఊరేగుతున్న శ్రీనివాసుడు

కమనీయంగా కమలానాథుడి కల్యాణోత్సవం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా అప్పలాయగుంట ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉభయ దేవేరులతో కమలానాథుడి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం పద్మావతీ, ఆండాల్ సమేత ప్రసన్న వేంకటేశ్వరుడిని పట్టు పీతాంబరాలతో వధూవరులుగా కల్యాణం పీటంపై అధిరోహింప జేశారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, తిప్పయ్యాచార్యులు ఆధ్వర్యంలో వేదమంత్రాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ శాస్త్రోక్తంగా ప్రసన్న వేంకటేశ్వరుడిచే ఉభయ నాంచారులకు మాంగళ్య ధారణ చేయించారు. పరిసరాలనుంచి భక్తులు విశేషంగా తరలి వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించి తన్మయత్వం చెందారు.



నేడు శ్రీవారి గరుడసేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 11న బుధవారం రాత్రి 7.00-8.30 గంటల మధ్య గరుడోత్సవం నిర్వహించనున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా వాహనాల రాకపోకల నియంత్రణ కోసం ఆలయం అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీబీఐ అధికారి పేరిట బెదిరింపులు

- సైబర్ నేరస్తుల ఉచ్చులో పడి రూ.1.20 కోట్లు పోగొట్టుకున్న రిటైర్డు టీచర్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సీబీఐ అధికారినంటూ తిరుపతికి చెందిన రిటైర్డు టీచర్‌ను భయపెట్టి.. ఆమె నుంచి రూ.1.20 కోట్లను ఆన్‌లైన్ ద్వారా లాగేసుకున్న ఘటన అలిపిరి పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు.. నవోదయ కాలనీలో నివాసమున్న రిటైర్డు టీచర్‌కు ఏప్రిల్ 16 నుంచి గత నెల 20వ తేది వరకు గుర్తు తెలియని వ్యక్తి నుంచి పలు దఫాలుగా ఫోన్ కాల్స్ వచ్చాయి. తాను సీబీఐ అధికారినంటూ ఆ వ్యక్తి పరిచయం చేసుకున్నాడు. మీ ఆధార్ నెంబరు ఢిల్లీలోని కెనరా బ్యాంకులో మోసపూరితంగా ఉపయోగించి సదాఖత్ ఖాన్ అనే వ్యక్తి మానవ అక్రమ రవాణా చేస్తూ అకౌంటును వాడుతున్నాడని బెదిరించాడు. అనంతరం వీడియో కాల్ చేసి.. వెంటనే మీబ్యాంకు ఖాతాల సమాచారం ఇవ్వాలని, లేదంటే కేంద్ర దర్యాప్తు సంస్థలకు తెలియచేస్తామని భయపెట్టాడు. దీంతో ఆమె తనకున్న వివిధ బ్యాంకు ఖాతాల నుంచి ఆరు విడతలుగా దాదాపు రూ.1.20 కోట్లు సైబర్ నేరగాళ్ల అకౌంటుకు మార్చారు. దీనిపై తాను మోసపోయానని గుర్తించి ముందుగా సైబర్ సెల్ నెంబరు 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆమె అలిపిరి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఐ రాంకిషోర్ కేసు నమోదు చేశారు.

ఐసర్ రసాయన శాస్త్ర

ప్రయోగశాలలో అగ్నిప్రమాదం

- భయాందోళన చెందిన విద్యార్థులు, కార్మికులు
- తక్షణ చర్యలతో ఊపిరి పీల్చుకున్న విద్యార్థులు

ఏర్పేడు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు మండలంలోని జంగాలపల్లి వద్ద ఉన్న కేంద్రియ విద్యా సంస్థ ఐసర్ (ఇన్‌స్టిట్యూట్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చి)లోని రసాయనిక శాస్త్ర ప్రయోగశాలలో మంగళవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగింది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రయోగశాలలోని ఒక రెఫ్రిజిరేటర్, కొన్ని వినియోగ పదార్థాల డబ్బాల నుంచి మంటలు వెలువడ్డాయి. దీంతో ప్రయోగశాల నుంచి పొగలు అలుముకున్నాయి. ప్రమాదాన్ని గమనించిన విద్యార్థులు, ఉద్యోగులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. అధికారులు తక్షణమే స్పందించి భద్రతా చర్యలు చేపట్టారు. శ్రీకాళహస్తి, వెంకటగిరి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పేశారు. పరికరాల నష్టం అంచనా వేయాల్సి ఉంది. ప్రాథమిక సమాచారం ప్రకారం అగ్నిప్రమాదం ప్రయోగశాలలో ఉన్న రిఫ్రిజిరేటర్, కొన్ని వినియోగ పదార్థాల వరకే పరిమితమైంది. ఐసర్ ప్రాంగణంలో ఉన్న అగ్ని ప్రమాద నివారణ సదుపాయాలతో కేవలం ప్రయోగశాలకు మాత్రమే మంటలు పరిమితమైనట్లు తెలుస్తోంది.



ఐసర్‌లోని రసాయనిక శాస్త్ర ప్రయోగశాలలో బయటకు వస్తున్న పొగ

ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ ఏర్పాటు

ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టడానికి సంస్థ స్వతంత్ర సత్య నిర్ధారణ కమిటీని(ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ) ఏర్పాటు చేయనున్నట్లు ఐసర్ డైరెక్టర్ శాంతను భట్టాచార్య తెలిపారు. ఈ కమిటీ విచారణ జరిపి నివేదిక అందించనుంది.

వేరుశనగ విత్తనాల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జూన్ 10(ఆంధ్రజ్యోతి): వేరుశెనగ విత్తనాల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్‌రావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వేరుశెనగ విత్తనాలను విస్తారంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు, పాకాల, చంద్రగిరి, రామచంద్రాపురం, తిరుపతి రూరల్‌లో 40 శాతం సబ్సిడీతో విత్తనాలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి ఆధార్‌కార్డుతో విత్తనాలను తీసుకోవాలని సూచించారు.

టీటీడీ ఉద్యోగుల ఇళ్లస్థలాలకు అనుమతులపై కమిటీ

- అధికారులను ఆదేశించిన ఈవో శ్యామలరావు



తిరుమల, జూన్10(ఆంధ్రజ్యోతి): టిటిడి ఉద్యోగులకు కేటాయించిన ఇళ్ల స్థలాలపై వివిధ శాఖల అనుమతుల విషయంలో సీనియర్ అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు సూచించారు.టీటీడీలోని వివిధ శాఖల ఉన్నతాధికారులతో తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో మంగళవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతూ.. ఆయా ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, ఇతర ఇంజినీరింగ్, మౌళిక సదుపాయాలపై టీటీడీ ఉన్నతాధికారులు చర్చించాలన్నారు. దిగువస్థాయిలో సమస్యలపై సీనియర్ అధికారులు చర్చించి పరిష్కరించాలని, ప్రభుత్వం స్థాయిలో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. జీఎన్సీ, ఎస్వీ పూర్‌హోం, కేటీ, వినాయకనగర్, రామనగర్ ప్రాంతాల్లోని టీటీడీ క్వార్టర్స్‌లో డ్రైనేజీ సమస్యలు, భవనాల లీకేజీలు, విద్యుత్ తదతర సమస్యలను తక్షణం పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో జేఈవో వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, డీఎల్వో వరప్రసాద్‌రావు, డిప్యూటీఈవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శాప్ బోర్డులో క్రీడాకారిణి రజనికి స్థానం



తిరుపతి(క్రీడలు), జూన్ 10(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్(శాప్) బోర్డులో హాకీ క్రీడాకారిణి రజనికి చోటు లభించింది. మంగళవారం ప్రభుత్వం శాప్ బోర్డు సభ్యులను ప్రకటించింది. ఇందులో ఎర్రావారిపాళెం మండలం ఎనుములవారిపల్లెకు చెందిన రజనీకి అవకాశం కల్పించింది. ఈమె హాకీలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ ప్రదర్శించింది. గతేడాది ఎఫ్ఐహెచ్-5 ఎస్ వరల్డ్‌కప్‌లో సిల్వర్‌మెడల్, 2022 కామన్వెల్త్‌గేమ్స్, ఏసియాకప్‌లో బ్రాంజ్ మెడల్స్, టోక్యో ఒలంపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. 2020లో జరిగిన టోక్యో ఒలంపిక్స్ ప్రాతినిత్యం వహించింది. గడిచిన 15ఏళ్లుగా హాకీలో రాణిస్తూ జిల్లా, రాష్ట్రంతో పాటు దేశానికి పేరుతెచ్చింది. ఆమె సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మక శాప్ బోర్డులో స్థానం కల్పించింది. ఈ సందర్భంగా రజనిని పలువురు క్రీడా ప్రముఖులు అభినందించారు.

వీఆర్‌కు వెంకటగిరి ఎస్ఐ

వెంకటగిరి, జూన్ 10(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి ఎస్ఐ సుబ్బారావును వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఉత్తర్వులు మంగళవారం జారీ చేశారు. ఎస్ఐ సుబ్బారావు ఓ న్యాయవాది పట్ల దురుసుగా వ్యవహరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఎస్ఐని వీఆర్‌కు పంపినట్టు పోలీసులు తెలిపారు.

ముగిసిన గోవిందుడి బ్రహ్మోత్సవాలు



తిరుపతి అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గోవిందరాజస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి జరిగిన చివరి ఘట్టంతో ముగిశాయి. ఉదయం పల్లకిపై స్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. అనంతరం కపిలతీర్థంలోని ఆళ్వార్ తీర్థానికి ఊరేగింపుగా చేరుకున్నారు. అక్కడ స్నపన తిరుమంజనం నిర్వహించారు. పుష్కరిణిలో కనుల పండువగా చక్రస్నానంనిర్వహించారు. తర్వాత పరిపాలన భవనం ఎదుట పీఆర్ తోటకు వేంచేశారు. సాయంత్రం వరకు అక్కడే ఉండి ఊరేగింపుగా ఆలయం చేరుకున్నారు. రాత్రి శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి





అమరావతి మహిళలను కించపరుస్తారా?



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న మహిళలు

నగరి, జూన్10 (ఆంధ్రజ్యోతి):అమరావతిని వేశ్యల రాజధాని అంటూ ఆ ప్రాంత మహిళలను కించపరిచిన జర్నలిస్టు కృష్ణంరాజును తక్షణం అరెస్టు చేయాలని తెలుగుమహిళలు డిమాండు చేశారు.నగరి పట్టణంలో మంగళ వారం ర్యాలీ నిర్వహించి పోలీస్‌స్టేషన్‌లో ఆయనపై ఫిర్యాదు చేశారు.తెలుగు మహిళ రాష్ట్ర అధికారప్రతినిధి మీరా ఆధ్వర్యంలో తెలుగు మహిళలు, టీడీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.పథకం ప్రకారం అమరావతిపై బురద జల్లుతున్న వైసీపీ నేతలపై, సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలంటూ నగరి టవర్‌క్లాక్ వద్ద మానవహారంగా ఏర్పడి డిమాండు చేశారు.అనంతరం ర్యాలీగా వెళ్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.నగరి పట్టణ అధ్యక్షుడు రమేష్ బాబు, దేశమ్మగుడి ఛైర్మన్ కృష్ణారెడ్డి,గుణశేఖర్, జవహర్‌రెడ్డి, జ్యోతినాయుడు, అల్లిముత్తు, తెలుగు మహిళలు కోమల, బాసంతి, గుణభూషణమ్మ, శ్రీమతి, మోహన, భారతి, కృష్ణవేణి, సంగీత తదితరులు పాల్గొన్నారు.

జగన్, భారతి క్షమాపణ చెప్పాలి



తహసీల్దార్ రాముకు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

పుంగనూరు, జూన్10 (ఆంధ్రజ్యోతి): మహిళలను కించపరిచిన సాక్షి యాజమాన్యంతో పాటు సీనియర్ జర్నలిస్టులు కొమ్మినేని శ్రీనివాస రావు, కృష్ణంరాజులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని పుంగనూరు నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు కవిత, జ్యోతి డిమాండ్ చేశారు. మంగళవారం పుంగనూరులోని ఇందిరా సర్కిల్ నుంచి మహిళలతో కలసి ప్లకార్డులు పట్టుకుని అమరావతి మహిళలపై కారుకూతలు కూయించిన మాజీ సీఎం జగన్, సాక్షి గ్రూప్ ఛైర్‌పర్సన్ భారతి వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలంటూ నినాదాలు చేస్తూ ఎన్టీఆర్ సర్కిల్, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. తహసీల్దార్ రాముకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పకపోతే మాజీ సీఎం జగన్‌ను రోడ్లపై తిరగనీయబోమని హెచ్చరించారు.

సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలి



గంగాధరనెల్లూరు బస్టాప్ కూడలిలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

గంగాధరనెల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): అమరావతిపై అవమానకర వ్యాఖ్యలు చేసిన జర్నలిస్టులు కృష్ణంరాజు, కొమ్మినేని శ్రీనివాసరావులపై, వారి మాటలను ప్రసారం చేసిన సాక్షి మీడియాపై చర్యలు తీసుకోవాలని గంగాధరనెల్లూరు మండల తెలుగు మహిళ అధ్యక్షురాలు లోకమ్మ, ఉపాధ్యక్షురాలు భువనేశ్వరి డిమాండ్ చేశారు. గంగాధరనెల్లూరు బస్టాప్ కూడలి ప్రాంతంలో మంగళవారం సాయంత్రం పలువురు మహిళలతో కలిసి సాక్షి మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సాక్షి దిన పత్రికలను నడిరోడ్డుపై తగులబెట్టి నిరసన వ్యక్తం చేశారు. రాజధాని మహిళలను కించపరిచిన వారు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని, లేదంటే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

వేరుశనగ విత్తనాల కోసం తోపులాట



బొమ్మయ్యపల్లె రైతు సేవాకేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

వెదురుకుప్పం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ విత్తనాల కోసం రైతులు ఎగబడుతున్నారు. మంగళవారం వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లె రైతు సేవాకేంద్రం వద్ద వేరుశనగ విత్తనాల కోసం వెళ్లిన రైతుల రద్దీ ఎక్కువకావడంతో తోపులాట జరిగింది. రైతులు బారులు తీరారు. కాగా, వెదురుకుప్పం పోలీసులు అక్కడికి చేరుకున్నారు. డిమాండ్‌కు తగినట్లు విత్తనాలు రాకపోవడం, ఒక్కొక్క రైతుకు ఒక్కొక్క బస్తానే(30కేజీలు) ఇస్తుండటంతో వారు అసహనం వ్యక్తంచేస్తున్నారు. ప్రభుత్వ విప్ థామస్ చొరవ చూపి రైతులకు సరిపడా విత్తనాలు వచ్చే విధంగా చర్యలు చేపట్టాల్సి ఉంది.

కూటమి ప్రభుత్వంలోనే నవ్యాంధ్ర నిర్మాణం సాధ్యం

● ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే నవ్యాంధ్ర నిర్మాణం సాధ్యమని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదైన సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో ఎన్డీయే ప్రభుత్వ సహకారంతో సీఎం చంద్రబాబు తీసుకొస్తున్న సంస్కరణలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ సహకారంతో రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా సీఎం పనిచేస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు ఆయన కృషి చేస్తున్నారని కొనియాడారు. పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణం కోసం కేంద్రం నుంచి ఇప్పటికే వేల కోట్ల రూపాయల నిధులు విడుదల చేయించుకున్నారని, శరవేగంగా పనులు జరుగుతున్నాయని తెలిపారు. నిరుద్యోగ పరిష్కారానికి ఎన్నో పరిశ్రమలను రాష్ట్రానికి తెప్పించి శంకుస్థాపనలు చేయించారని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రాష్ట్రంలో అనేక ప్రగతి కార్యక్రమాలు చేపట్టారన్నారు. భవిష్యత్‌లో రాష్ట్రం దేశంలోనే అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తుందని ఆప్రకటనలో తెలిపారు.

ఐదు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా ఐదు మండలాల్లో భారీవర్షం కురిసింది. మండలాలవారీగా గుడుపల్లిలో 58.6, సదుంలో 45.2, కుప్పంలో 20.2, రొంపిచెర్లలో 14.8, విజయపురంలో 9.6 మిమీ వర్షపాతం నమోదయ్యింది.

నేడు తిరుపతికి కేంద్ర మంత్రి బండి సంజయ్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూన్ 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ బుధవారం తిరుపతి పర్యటనకు రానున్నారు. ప్రధాని నరేంద్రమోదీ సేవా సుపరిపాలన, పేదల సంక్షేమానికి 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా తిరుపతిలో నిర్వహించనున్న పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. 11వ తేదీ ఉదయం 11.30 గంటలకు ఆయన తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి తిరుపతి అలిపిరి పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న కేబీఆర్ ఫంక్షన్ హాలుకు చేరుకుంటారు. 12.30 గంటలకు ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ పథకాల ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1 గంటకు అక్కడే విలేకరుల సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజనం అనంతరం 3 గంటలకు స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో మొక్కలు నాటనున్నారు. అనంతరం అక్కడి నుంచి నేరుగా విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్‌కు పయనమవుతారు.

పంటలపై ఆగని గజదాడులు

కల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజదాడులు ఆగడం లేదు. మండలంలోని దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లి వద్ద సోమవారం రాత్రి టమోటా, మామిడి, కొబ్బరి చెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన 14 ఏనుగుల గుంపు కుమ్మరిపల్లి సమీపానికి చేరుకొని అరుపులు పెట్టాయి. కుమ్మరిపల్లిలోని రైతు కృష్ణయ్యకు చెందిన 2 ఎకరాల టమోటా పంటను ధ్వంసం చేశాయి. ఇప్పుడిప్పుడే టమోటా ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఆనందంగా ఉన్న టమోటా రైతు కృష్ణయ్యకు టమోటా పంటపై ఏనుగుల దాడి చేయడంతో అపార నష్టం వాటిల్లింది. ఇదే గ్రామానికి చెందిన రైతు ధర్మేంద్రకు చెందిన మామిడి, కొబ్బరి, పనస చెట్లను ఏనుగులు ధ్వంసం చేశాయి. ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటను ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ, ఎఫ్‌బీవో కృష్ణమూర్తి పరిశీలించారు. ప్రభుత్వ పరంగా నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. పంటలపై దాడులు చేసిన ఏనుగుల గుంపు వచ్చిన మార్గంలోనే చింతలవంక వద్దకు చేరుకున్నట్లు స్థానిక ప్రజలు తెలిపారు. అడవిలో తిష్ట వేసిన ఏనుగుల గుంపు జాడను గుర్తించేందుకు మంగళవారం అటవీశాఖ అధికారులు గాలింపు చేపట్టారు. ఎట్టకేలకు సాయంత్రానికి ఏనుగుల గుంపు గెండేవారిపల్లి సమీపంలోని అడవిలో ఉన్నట్లు గుర్తించారు.



ధ్వంసమైన కొబ్బరిచెట్టు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన టమోటా పంట

సూర్యఘర్ యోజనపై క్లస్టర్ స్థాయిలో సమావేశాలు జరపండి

● అధికారులకు కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన ద్వారా రాయితీతో సోలార్ రూఫ్‌టాప్ నిర్మించుకోవడంపై క్లస్టర్ స్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జేసీ విద్యాధరితో కలిసి ఈ పథక అమలుకు సంబంధించి ట్రాన్స్‌కో, నెడ్‌క్యాప్, జిల్లాపరిషత్, డీఆర్డీఏ, బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ రూఫ్ టాప్ ద్వారా ఉత్పత్తిచేసే విద్యుత్‌తో ఇంటి అవసరాలు తీర్చుకుంటూ మిగులు విద్యుత్‌ను తిరిగి గ్రిడ్‌కు అమ్ముకోవడం ద్వారా ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్థాయిలో అవగాహన పెంచేందుకు గాను సమావేశాలు జరపాలన్నారు. సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునేందుకు చాలామంది ముందుకు వస్తున్నా, తొలుత మొత్తం నగదు చెల్లించి, ఆ తర్వాత ప్రభుత్వ రాయితీ పొందే అంశంపై వినియోగదారుల్లో ఆసక్తి తగ్గుతోందన్నారు. ఇందుకోసం బ్యాంకర్లు, వినియోగదారులకు రుణసదుపాయం కల్పిస్తే నెలవారి వాయిదాలు చెల్లించేలా వినియోగదారులకు వివరించాలని చెప్పారు. ఇందుకోసం మండల, గ్రామస్థాయి కమిటీలను ఏర్పాటుచేసి ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు, ఇతర రాయితీ వివరాలను తెలియజేయాలన్నారు. మండలస్థాయిలో డీఆర్డీఏ ఏపీఎంలు, ట్రాన్స్‌కో ఏఈలు, బ్యాంకర్లు కమిటీగా ఏర్పడాలని, గ్రామస్థాయిలో సచివాలయ సిబ్బంది, డీఆర్డీఏ, మెప్మా సిబ్బంది బ్యాంకు అధికారులతో కమిటీలు ఏర్పాటు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్, ఈఈలు మునిచంద్ర, సురేష్, నెడ్‌క్యాప్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ అబ్దుల్ రియాజ్, జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకర్‌రావు, డీఆర్డీఏ పీడీ శ్రీదేవి, ఎల్డీఎం హరీష్, వివిధ వాణిజ్య బ్యాంకుల కంట్రోలింగ్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

‘తోతాపురి’ని మద్దతు ధరతో కొనండి

● దామలచెరువులో మామిడిరైతుల ధర్నా.. జాతీయ రహదారిపై బైఠాయింపు



దామలచెరువులో ధర్నా చేస్తున్న మామిడి రైతులు

పాకాల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): తోతాపురి రకం మామిడి కాయలను మద్దతు ధరతో కొనాలంటూ మంగళవారం మధ్యాహ్నం రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వం కిలోపై రాయితీ రూ.4 ఇస్తుండగా, రూ.8కి కొనాలని కోరారు. దామలచెరువులో మ్యాంగో నగర్‌లో సోమవారం ఉదయం రూ.6 వంతున కొన్నారు. సాయంత్రం రూ.4 ధర చెప్పారు. ఈ క్రమంలో మంగళవారం తక్కువ మంది రైతులే ట్రాక్టర్లలో మామిడి కాయలు తీసుకొచ్చారు. ర్యాంపుల్లో దళారులు రూ.4 ధర చెప్పడంతో ఆగ్రహిస్తూ చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారి హైస్కూల్ గేటులో రోడ్డుపై బైఠాయించారు. ర్యాంపు యజమానులు, సప్లయర్స్ ఫ్యాక్టరీలు కిలోకు రూ.8 ఇస్తే ప్రభుత్వం రూ.4 ఇస్తుందని ప్రకటించినా ఫ్యాక్టరీలు కొనడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో దళారులు సిండికేట్ అయి ర్యాంపుల్లో తక్కువ ధరకు కొని.. అధిక ధరకు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. సీఎం, కలెక్టర్లు మద్దతు ధరకు కొనాలని ప్రకటించినా దళారుల వ్యవస్థతో ఫలితం లేకుండా పోతోందన్నారు. తోటల్లో పక్వానికి వచ్చిన మామిడి కాయలు రాలిపోతున్నాయని, వెంటనే కొనుగోళ్లు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. తహసీల్దారు సంతోష్‌సాయి, సీఐ సుదర్శన ప్రసాద్, ఉద్యాన అధికారిణి శైలజ రైతులతో చర్చించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. సప్లయర్స్ మద్దతు ధరకు కొనాలని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతుల ధర్నాతో భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. రైతులు ధర్నా విరమించారు. ఆ తర్వాత బయట వ్యాపారులు రూ.6 చొప్పున కొని తీసుకెళ్లినట్లు తెలిసింది. ప్రభుత్వ మద్దతు ధరకు మామిడి కొనకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు.

పోలీసుల అదుపులో మధ్యప్రదేశ్ గ్యాంగ్

● చోరీలు, దోపిడీలకు పాల్పడిన ముఠా

● వేలి ముద్రలు, కనుబొమ్మల ఆధారంగా పట్టుకున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పలు రాష్ట్రాల్లో చోరీలు, దోపిడీలకు పాల్పడిన మధ్యప్రదేశ్‌కు చెందిన గ్యాంగ్‌ను తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దొంగతనాలు, దారి దోపిడీలు చేయడంలో ఆరితేరిన ఈ ముఠాలోని ఇద్దరిని పట్టుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన 20 మంది బృందాలుగా విడిపోయి.. ఒక్కో టీము ఒక ప్రాంతాన్ని ఎంచుకుని దోపిడీ, దొంగతనాలు చేస్తున్నారు. ప్రస్తుతం పోలీసుల అదుపులో ఉన్న ఇద్దరు.. గతేడాది తిరుచానూరు, గాజులమండ్యంలోని మూడు ఇళ్లల్లో బెదిరించి బంగారు నగలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, నగదు అపహరించుకుని వెళ్లినట్లు తెలిసింది. దీంతో పాటు కేరళ, తమిళనాడు, కర్ణాటకతో పాటు విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాదు వంటి నగరాల్లో దోపిడీలకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇప్పటికే వీరిపై పలు ప్రాంతాల్లో పోలీసు కేసులు నమోదయ్యాయి. గతంలో కేరళ పోలీసులు అరెస్టు చేయగా, అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన వీరు మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నారు. అందులోనూ పెద్ద, పెద్ద భవంతులు, కారు షోరూములు, ఎలక్ట్రానిక్ షోరూములను ఎంచుకుని 10 రోజుల పాటు రెక్కీ నిర్వహించాక అర్ధరాత్రి పూట చోరీలకు పాల్పడుతుంటారని పోలీసులు చెబుతున్నారు. అవసరమైతే వీరు రాష్ట్ర, జాతీయ రహదారులపై కాపుకాచి వాహనాలు ఆపి ఉంటే.. తుపాకులు, రాడ్లతో భయపెట్టి దోపిడీకి పాల్పడుతుంటారని సమాచారం.

ఎలా పట్టుబడ్డారంటే..

తిరుపతి నగరం కాటన్‌మిల్లు.. రూరల్‌లో దామినేడు వద్ద రెండు మారుతీ కారు షోరూముల్లో సిబ్బంది కాళ్లు, చేతులు కట్టేసి రూ.7.30 లక్షలు నగదు అపహరించుకుని వెళ్లారు. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. ఈ ముఠాపై దృష్టి పెట్టారు. ఘటన జరిగిన ప్రాంతాల నుంచి వేలి ముద్రలు సేకరించారు. తిరుపతి ఫింగర్ ప్రింట్ పోలీసుల వద్ద ఉన్న పాత నేరస్థులు, దోపిడీదారుల వేలి ముద్రలతో పరిశీలించారు. ఇందులో మధ్యప్రదేశ్‌కు చెందిన దోపిడీ దొంగ వేలి ముద్రలతో సరిపోవడంతో ఆ దిశగా దర్యాప్తు మొదలు పెట్టారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి ఆధ్వర్యంలో ఇద్దరు డీఎస్పీలు, మరో ఇద్దరు సీఐలు, నలుగురు ఎస్‌ఐలు, సిబ్బందిని మూడు టీమ్‌లుగా విభజించి బెంగళూరు, మధ్యప్రదేశ్‌కు ఎస్పీ హర్షవర్ధన రాజు పంపారు. అక్కడి పోలీసులతో సమన్వయం చేసుకుని దోపిడీ దొంగల మొబైల్ నెంబర్లు, ఆధార్ కార్డుల ఆధారంగా వారి కదలికలపై నిఘా పెట్టి ఇద్దరిని పట్టుకుని విచారిస్తున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు.. వీరు దాదాపు 10 ప్రాంతాల్లో దోపిడీలు, దొంగతనాలకు పాల్పడినట్లు తెలిసింది. ఇదే ముఠాలో మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు.

ముక్కంటికి నేత్రపర్వంగా ఊంజల్ సేవ



శ్రీకాళహస్తి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళ హస్తీ శ్వరాలయంలో మంగళ వారం రాత్రి పౌర్ణమిని పురస్కరిం చుకుని ఊంజల్ సేవ నేత్ర పర్వంగా కొనసాగింది. మొద ట ఆలయం లోని అలంకార మండపంలో జ్ఞాన ప్రసూ నాంబ సమేత శ్రీకాళహస్తీ శ్వరస్వామి ఉత్సవమూర్తుల కు పలు అభిషేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవే ద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి ఊంజల్‌సేవ మండపానికి తీసకువచ్చారు. పౌర్ణమి వెండి కాంతుల్లో ఊంజల్‌సేవలో ఊయల ఊగుతున్న స్వామి అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ గుడివీధిలో కొలువై ఉన్న చక్రేశ్వరస్వామి ఆలయ ఆవరణంలో ఉన్న ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు అర్చకులు ఆంజనేయస్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు వడమాలలు, తమలపాకుల మాలలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు.

త్వరలో మరో 50 ఎలక్ట్రిక్ బస్సుల రాక



తిరుపతి(ఆర్టీసీ), జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జిల్లాకు త్వరలో మరో 50 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి రానున్నాయి. ఈ బస్సులను అద్దె ప్రాతిపదికన నడిపేందుకు పినాకిల్ సంస్థ టెండర్ దక్కించుకుంది. వీటిని మంగళం డిపోకు కేటాయిస్తుండడంతో అక్కడే చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఆర్టీసీ యంత్రాంగం ఎస్పీడీసీఎల్ విభాగాన్ని సంప్రదించింది. రేణిగుంట సబ్‌స్టేషన్ నుంచి 33కేవీ లైన్ నేరుగా డిపోకు తీసుకువాలని కోరింది. ఇందుకయ్యే వ్యయం, డిపాజిట్ రూ.6కోట్లతో ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి ప్రతిపాదనలు పంపింది. అక్కడి నుంచి ఉత్తర్వులు రాగానే విద్యుత్ సరఫరా ఏర్పాట్లు మొదలుకానున్నాయి. అది పూర్తికాగానే డిపో గ్యారేజీకి పశ్చిమాన ఖాళీ స్థలంలో చార్జింగ్ స్టేషన్ పనులు మొదలుకానున్నాయి. దాదాపు 30 వరకు చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. కాగా ఇప్పటికే జిల్లాలో వంద ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. తిరుమల-తిరుపతి, తిరుమల-రేణిగుంట, తిరుపతి-మదనపల్లె, కడప, నెల్లూరుకు నడుస్తున్నాయి.

జుబేదాకు సాదర వీడ్కోలు



జడ్పీ డిప్యూటీ సీఈవో జుబేదాను సన్మానిస్తున్న సీఈవో రవికుమార్ నాయుడు

చిత్తూరు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో జుబేదా సేవలు మరువలేనివని జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు అన్నారు. మంగళవారం ఆమెను ప్రభుత్వం కడప జిల్లా డ్వామా విజిలెన్స్ అధికారిగా బదిలీ చేసింది. ఈ సందర్భంగా జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో ఆమెను సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటనారాయణ, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుప్పంలో నకిలీ వైద్యుడు



అరుణ్ అన్నాత్‌ను విచారిస్తున్న కడా పీడీ, డీఎస్పీ తదితరులు

కుప్పం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుప్పంలో సుమారు ఏడాదికి పైగా ప్రాక్టీస్ చేస్తున్న నకిలీ వైద్యుడి భాగోతం కడా పీడీ వికాస్ మర్మత్ తనిఖీలతో బయట పడింది. వివరాలు ఇలా... కుప్పం పట్టణం ప్యాలెస్ రోడ్డులో అరుణ్ అన్నాత్ అనే వైద్యుడు అన్నాయ్ పీఆర్ హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోమ్ పేరుతో హాస్పిటల్ ప్రారంభించి సుమారు ఏడాదికి పైగా ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇతడిపై కొంతమంది అనుమానంతో వైద్యాధికారులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు చేసి లైసెన్సు లేకుండా నడుపుతున్న మెడికల్ షాపును సీజ్ చేశారు. ఇండియన్ మెడికల్ కౌన్సిల్‌కు అందిన ఫిర్యాదుతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. కడా పీడీ వికాస్ మర్మత్, డీఎస్పీ పార్థసారథి మంగళవారం రాత్రి అన్నాయ్ పీఆర్ హాస్పిటల్ అండ్ నర్సింగ్ హోంలో ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. హాస్పిటల్ పేరుతో ప్రాక్టీస్ చేస్తున్న అరుణ్ అన్నాత్ నకిలీ వైద్యుడు అని తమ పరిశీలనలో తేలిందని కడా పీడీ తెలిపారు. అతడిపై చర్యలు తీసుకోవడంతో పాటు హాస్పిటల్‌ను సీజ్ చేస్తామన్నారు. తనిఖీల్లో కడా సలహా మండలి సభ్యుడు డాక్టర్ బీఆర్.సురేష్ బాబు, కుప్పం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

మామిడి రైతులకు న్యాయం చేసేందుకు చర్యలు



ర్యాంపు యజమానులతో మాట్లాడుతున్న ఏడీ పరమేశ్వర్, తహసీల్దార్ జయసింహ

కల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు మామిడి రైతులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని.. ప్రోసెసింగ్‌ల వద్ద తోతాపురి మామిడి రకం టన్నుకు రూ.8 వేలు చెల్లించాల్సిందేనని జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వర్, తహసీల్దార్ జయసింహ తెలిపారు. పులిచెర్ల మండలంలోని ర్యాంపులను మంగళవారం పరిశీలించిన అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన తోతాపురి టన్నుకు రూ.4 వేలు రైతు ఖాతాలో జమచేయడం జరుగుతుందన్నారు. మండలంలోని ర్యాంపుల వద్ద రెండు షిఫ్టుల్లో ఇద్దరేసి చొప్పున ప్రభుత్వ సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు సిబ్బంది అందుబాటులో ఉండేలా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. సిబ్బందికి మామిడి రైతులు సహకరించి తమ వివరాలు అందజేయాలని తెలిపారు.

పనుల జాబితాలతో సరి..!

● తూతూమంత్రంగా కుప్పం మండల సర్వసభ్య సమావేశం


సమావేశంలో ఎంపీపీ అశ్విని, ఎంపీడీవో విజయనాథ్ తదితరులు

కుప్పం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఆ పని చేశాం.. ఈ పని చేయబోతున్నాం.. అంటూ పనుల జాబితాలను అధికారులు ఏకరువు పెట్టడానికే కుప్పం మండల ప్రజాపరిషత్తు సమావేశం పరిమితమయ్యే దుస్థితికి చేరుకుంది. ఒక్క బాధ్యత గల అధికారి గాని, అధికార పక్షానికి చెందిన బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధి గాని లేకపోవడంతో సమావేశం తూతూమంత్రంగా ముగిసింది. కుప్పం మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎంపీపీ అశ్విని, ఇన్‌చార్జి ఎంపీడీవో విజయనాథ్‌లు వేదికనలంకరించిన ఈ సమావేశంలో మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచులు హాజరయ్యారు. సమావేశం ప్రారంభం కాగానే మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన కిందిస్థాయి అధికారులు తమతమ శాఖలకు చెందిన నివేదికలు చదివి వినిపించారు. మధ్యలో ఒకరిద్దరు ఎంపీటీసీలు, సర్పంచులు వేసిన ప్రశ్నలకు పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. వింతేమిటంటే మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల ముఖాలు గాని.. వారి ఫోన్ నెంబర్లు గాని చాలావరకు ఇప్పటికీ గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులకు తెలియకపోవడం. 'మీరు ఎవరంటూ' ఎంపీపీతో సహా కొంతమంది ప్రజాప్రనిధులు అధికారులను ప్రశ్నించడం విడ్డూరంగా అనిపించింది. అధికారుల ఫోన్ నంబర్లను ఒకరిద్దరు ప్రజాప్రతినిధులు అడిగి ఫోన్లలో ఫీడ్ చేసుకోవడం కనిపించింది. ఎంపీపీతో సహా అత్యధికంగా ఎంపీటీసీలు, సర్పంచులు ప్రతిపక్ష వైసీపీకి చెందినవారు కావడం గమనార్హం. ఇంతవరకు వారికి అధికారుల ముఖాలు తెలియలేదంటే ప్రజావసరాలను తీర్చడంలో ఎంత చొరవ తీసుకుంటున్నదీ తెలిసిపోతుంది. ఇలా తూతూమంత్రంగా జరిగిన కుప్పం మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశం మధ్యాహ్నం ఒక గంటకల్లా ముగిసిపోయింది. అంతకు సుమారు అర్ధగంట ముందే కోడి మాంసంతో కూడిన విందు భోజనాలు సమావేశం జరిగిన మండల పరిషత్తు హాలులోనే తెచ్చి ఉంచడంతో ఆ ఘుమఘుమలు మొత్తం వ్యాపించాయి. దీంతో ఎవరికివారుగా కుర్చీలలోంచి లేచి వచ్చేసిన సమావేశంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు భోజనాలపై పడ్డారు. అంతకుముందు సమావేశంలో లేనివారు సైతం భోజనాల సమయానికి వచ్చి ప్లేట్లను చేతుల్లోకి తీసుకున్నారు. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన బాధ్యత కలిగిన ప్రజాప్రతినిధులు ఒక్కరు కూడా హాజరు కాకపోవడం సైతం మండల ప్రజాపరిషత్తు సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా జరగడానికి కారణమైంది.

సచివాలయాల తనిఖీ


సిబ్బందికి ప్రజా సేవలపై సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

కుప్పం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలోని 1 నుంచి 5 సచివాలయాలను మంగళవారం మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ కార్డుల ఆన్‌లైన్, ఇతర ప్రజా సేవల నిర్వహణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకుని అవసరమైన సూచనలు చేశారు. ప్రజలకు సకాలంలో మర్యాదపూర్వకంగా సేవలు అందాలని ఆదేశించారు. సిబ్బంది హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. కుప్పంలోని కుప్పం -3, కుప్పం -5, సామగుట్టపల్లె సచివాయాల్లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాల సర్వీసులు సక్రమంగా ప్రజలకు అందాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈనెల 21వ తేదీన ప్రతిష్ఠాత్మకంగా తలపెట్టిన యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణ కోసం మున్సిపాలిటీ పరిధిలో 100 ప్రదేశాలను ఎంపిక చేశామని, ఆయా ప్రాంతాల్లో తగిన ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

జోరుగా పూడికతీత పనులు


కుప్పం కొత్తపేటలో సాగుతున్న పూడికతీత పనులు

కుప్పం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో కొత్తపేటలోని ప్రధాన మురుగు కాలువల్లో పూడికతీత పనులు జోరుగా సాగుతున్నాయి. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులను దృష్టిలో ఉంచుకుని మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు ఈ పనులను చేపట్టారు. కాలువలపై ఉన్న మూతలను తొలగించి సిబ్బందిచే పూడిక తీయిస్తున్నారు. వానాకాలం ఆగమించిన నేపథ్యంలో మురుగు కాలువల్లో మురుగు నిల్వ ఉండి దోమలు విజృంభించి అంటు వ్యాధులు వ్యాపించకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.

పూసల రవికి అవార్డు



విజయవాడలో అవార్డు అందుకుంటున్న పూసల రవి

పలమనేరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సంచారజాతుల సంఘ అధ్యక్షులు పూసల రవికి మంగళవారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో సేవారత్న అవార్డును అందజేశారు. మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్స్ సంస్థ చైర్మన్ కృష్ణమూర్తి అవార్డును అందజేశారు. అవార్డు తాను చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలకు మరింత బాధ్యతను ఇస్తుందని, ఇదే స్ఫూర్తితో పేదల కోసం తాను పనిచేస్తానని రవి తెలిపారు.

మామిడి రైతులకు అన్యాయం జరగదు : కలెక్టర్


కలెక్టర్‌తో మాట్లాడుతున్న సాయిరాం మామిడి ఉత్పత్తిదారుల సొసైటీ సభ్యులు

కల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులకు ఏమాత్రం అన్యాయం జరగదని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి సాయిరాం మామిడి ఉత్పత్తిదారుల సొసైటీ బృందానికి హామీ ఇచ్చారు. మంగళవారం ఎల్లంకివారిపల్లి సాయిరాం మామిడి ఉత్పత్తిదారుల సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి వాసుతో కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. తమ సొసైటీ ద్వారా 5000 టన్నుల తోతాపురి మామిడి కాయలను సరఫరా చేస్తామని సొసైటీ అధ్యక్షులు శ్రీనివాసులునాయుడు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాలుగు కంపెనీలకు మామిడికాయలు సరఫరా చేసేందుకు సొసైటీకి అవకాశం కల్పిస్తామన్నారు. ప్రభుత్వం తోతాపురి టన్నుకు రూ.4 వేలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. సభ్యులు ప్రకాష్‌బాబు, వేణు, మునిరత్నం, పురుషోత్తం, ప్రభాకర్, సుమంత్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



సోమల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సోమల మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. మంగళవారం స్వయంభేశ్వరస్వామి ఆలయం వద్ద సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆలయంలో అభిషేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శివశంకర్, ఆలయ ధర్మకర్త సోమశేఖర్, మల్లికార్జున, సుబ్రహ్మణ్యం యాదవ్, మహేంద్రబాబు, సోమశేఖర్, లింగయ్య, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

అనుమానిత వ్యక్తులపై సమాచారం అందించాలి


మాట్లాడుతున్న పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్

సోమల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో అనుమానిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పుంగనూరు రూరల్ సీఐ రాంభూపాల్ తెలిపారు. మంగళవారం రాత్రి పెద్దఉప్పరపల్లె సచివాలయంలో పోలీసుల పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే చిన్నపాటి వివాదాలకు ఫిర్యాదులు చేసుకోవడం మంచిది కాదన్నారు. గ్రామ స్థాయిలోనే వాటిని పరిష్కరించుకోవాలన్నారు. సారా అమ్మకాలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ శివశంకర్, మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు, మాజీ సర్పంచి బాలాజీ నాయుడు, రఫీ, రెడ్డెప్ప నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు చౌడేపల్లె మండల సమావేశం

చౌడేపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లీలామాధవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని కోరారు.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు


పలమనేరు: రోగులకు పండ్లు అందజేస్తున్న అభిమానులు

పుంగనూరు రూరల్, జూన్10 (ఆంధ్రజ్యోతి): నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను పుంగనూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో టీడీపీ నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాధవరెడ్డి, సీవీ. రెడ్డి, పోలీస్‌గిరి, శ్రీకాంత్, మోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి, కవిత, సుహేల్‌బాషా, గంగాధర్, ఐటీడీపీ కుమార్, కిరణ్, చైతన్యరాయల్, ప్రసాద్‌స్వామి, గంగరాజు, రమణ, డాక్టర్ అప్పిరెడ్డి, రాంబాబు, సుబ్రహ్మణ్యం, అప్పిరెడ్డి, మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **పలమనేరు:** సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలు మంగళవారం పలమనేరులో ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలకృష్ణ అభిమానులు అమ్ములు, నాగరాజు, బీఆర్‌సి కుమార్, శేఖర్, భాస్కర్, మురళి, నదీమ్, మౌలా, ఫయాజ్, రవి పాల్గొన్నారు.

● **సోమల:** నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు మంగళవారం సోమల మండలంలో ఘనంగా జరుపుకున్నారు. ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, నాయకులు బోస్, కోటీశ్వరరావు, చంద్రశేఖర్‌నాయుడు, సుబ్బయ్యశెట్టి, రెడ్డి పార్థసారధి, మల్లికార్జున, మహేంద్రబాబు, చెన్నకేశవులు, షేక్ అమాన్లు, వెంకటరత్నం, రవి పాల్గొన్నారు.

జిల్లా ఎరుకల సంఘ అధ్యక్షుడికి సన్మానం


రామకృష్ణను సన్మానిస్తున్న దళిత సంఘ నాయకులు

పుంగనూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎరుకల సంఘ నూతన అధ్యక్షుడిగా ఎంపికైన ఎం.రామకృష్ణను పుంగనూరు దళిత సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ ప్రజా భవన్‌లో ఆయన్ను శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరుకుల సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి , మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్‌కుమార్, సుమిత్ర రమణ, జేవీ నాగరాజు, చంద్ర, నందీశ్వర్, మునికృష్ణ, శేషాద్రి, నరసింహులు, పార్వతమ్మ, రావణమ్మ, నాగరాజ, బాలు తదితరులు పాల్గొన్నారు.

చరణ్‌తేజ్‌కు షైనింగ్ స్టార్ అవార్డు



సదుం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వినాయక జూనియర్ కళాశాలలో ఇంటర్ ఒకేషనల్ కోర్సు చదువుతున్న చరణ్‌తేజ్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్నట్లు కళాశాల కరస్పాండెంట్ రమణారెడ్డి మంగళవారం తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థిని కళాశాల అధ్యాపక బృందం అభినందించింది.

ముందస్తు జాగ్రత్తలతో క్షయవ్యాధి దూరం


క్షయవ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి వినయ్

రొంపిచెర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్తలతో క్షయవ్యాధి దూరంచేసు కోవచ్చని వైద్యాధికారి డాక్టరు వినయ్ అన్నారు. మంగళవారం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ ఫజులాపేటలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో హెచ్ఈ రాజేశ్వరి, సాయిపూజిత, గాయిత్రి, గంగాభవాని, రెడ్డెమ్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

70 మందికి ఉచిత వైద్య సేవలు


వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ తరంగిణి

పలమనేరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి) : పలమనేరులోని సాయిరాం మల్టీస్పెషాలిటి ఆసుపత్రిలో మంగళవారం ఉచిత సంతానసాఫల్య శిబిరం నిర్వహించారు. బెంగళూరు గర్భగుడి వారి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 70 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు యుగంధర్, డాక్టర్ తరంగిణి పాల్గొన్నారు.

సదుం సీడీపీవోగా వాణిశ్రీ



సదుం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల, సదుం ప్రాజెక్టు నూతన సీడీపీవోగా వాణిశ్రీ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఐసీడీఎస్ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


కల్లూరు : గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న సీడీపీవో వాణి శ్రీదేవి


పలమనేరు: తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న వెంకటముని

కల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీవో వాణి శ్రీదేవి తెలిపారు. పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీవోగా వాణి శ్రీదేవి మంగళవారం బాధ్యతలు చేపట్టిన అనంతరం పులిచెర్ల అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులను విజయవంతం చేయాలన్నారు. బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి సిబ్బంది కృషి చేయాలని తెలిపారు. అనంతరం కిశోరి వికాసం గోడపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో శిద్దరామయ్య, సూపర్వైజర్లు విజయలక్ష్మీ, రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

చౌడేపల్లె: బాల్య వివాహాలతో భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఐసీడీఎస్ బ్లాక్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ వెంకటముని పేర్కొన్నారు. మంగళవారం ఆయన స్థానిక చిట్రెడ్డిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలు, చిన్నారుల తల్లిదండ్రులకు కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు నేరమన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ ప్రభావతి, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** ఆడపిల్లలను కాపాడుకోవడం అందరి బాధ్యత అని పలమనేరు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవీలత పేర్కొన్నారు. మంగళవారం పలమనేరు మండలం టి.ఓడ్డూరులో కిశోర బాలికలు, తల్లులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్యవివాహాలు, బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాలికల వ్యక్తిగత శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

సదుం: అందరి సహకారంతో బాల్యవివాహాలను అరికట్టాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవో మల్లీశ్వరి సూచించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆమె ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అవగాహన కల్పించారు. ఎంఈవో దామోదర్, డా.గిరీషా, ఎంపీడీవో హరిబాబు, ఆరోగ్య పర్యవేక్షకులు ఉదయ భాస్కర్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: బాల్య వివాహాలు చేయడం నేరమని సీడీపీవో సరళాదేవి అన్నారు. మంగళవారం స్థానిక చంద్రమౌళి సచివాలయంలో కిశోర బాలికలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ ఐషానజీరిన్ తాజ్, సుమతి, వాణి, అనురాధ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ



రామకుప్పం మండలం కెంచనబల్లలో వేరుశనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

రొంపిచెర్ల, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో బోడిపాటివారిపల్లెలో రైతు భరోసా కేంద్రంలో మంగళవారం వ్యవసాయాధికారులతో కలిసి రైతులకు వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీఏఏ వెంకట్రమణనాయక్ మాట్లాడుతూ విత్తనాలు తీసుకున్న ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని.. పంట నమోదు చేసుకోవాలని సూచించారు. జనుము, జీలుగ విత్తనాలు రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రొంపిచెర్ల సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్, మాజీ సర్పంచ్ రవికుమార్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలోని కెంచనబల్ల, ననియాలతాండా, బైపరెడ్డపల్లె రైతుసేవా కేంద్రాల్లో రైతులకు మంగళవారం వేరుశనగ విత్తనాలను పంపిణీ చేశారు. రామకుప్పం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహులు, ౖ పత్రనారాయణాచారి, ఎస్టీ సెల్ కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు కామరాజనాయక్, నేతలు సత్తి, చంద్రశేఖర్‌రెడ్డి, గుణశేఖర్, వెంకటేశ్, నారాయణస్వామి, కామరాజనాయక్, సామూనాయక్, సోమలానాయక్, రామూనాయక్ తదితరులు పాల్గొన్నారు.

● కల్లూరు: పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి సచివాలయంలో మంగళవారం వేరుశనగ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేష్, సురేష్, గోపాల్, కిరణ్ రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో

ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలోని కట్టకిందపాళ్యానికి చెందిన వీరభద్రయ్య కుమారుడు సుబ్రహ్మణ్యం(60) కుటుంబ కలహాలతో మంగళవారం పురుగుల మందు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మదనపల్లెకు తరలించారు.

కోడి పందేలపై దాడులు

● ఎనిమిది మంది అరెస్టు

పుంగనూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలోని పుంగమ్మ చెరువులో కోడి పెందేల స్థావరంపై ఎస్ఐ లోకేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది మంగళవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 8 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.20,500 నగదు, ఓ కోడిని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు- మదనపల్లె మార్గంలో గుర్తుతెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని భీమగానిపల్లె పంచాయతీ గాంధీపురానికి చెందిన పాపన్న కుమారుడు గంగులప్ప(60) ద్విచక్రవాహనంలో పుంగనూరుకు వస్తుండగా మదనపల్లె వైపు వెళుతున్న కారు గాంధీపురం సమీపంలో ఢీకొని వేగంగా వెళ్లిపోయింది. ప్రమాదంలో గంగులప్ప తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 వాహనంలో పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మామిడి రైతులు పేర్లు నమోదు చేసుకోవాలి

గంగాధరనెల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పల్ప్ ఫ్యాక్టరీలకు తోతాపురి మామిడి కాయలను తోలే రైతులు తమ పేర్లను రైతుసేవాకేంద్రం ఇన్‌చార్జిల వద్ద నమోదు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. గంగాధరనెల్లూరు పంచాయతీ 100 గొల్లపల్లె వద్ద గల జైన్‌ఫ్యాక్టరీని మంగళవారం రాత్రి అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన తోతాపురి మామిడి టన్ను రూ.12వేలులో పల్ప్ ఫ్యాక్టరీ నిర్వాహకులు ఇచ్చితంగా రైతులకు రూ.8వేలు చెల్లించాలని ఆదేశించారు. మిగిలిన రూ.4వేలును ప్రభుత్వం రైతుల ఖాతాలకు జమ చేస్తుందని చెప్పారు. తూగుండ్రంకు వెళ్లే రహదారి పక్కన ఉన్న జైన్ ఫ్యాక్టరీ రెండవ యూనిట్‌లో సైతం పల్ప్ ప్రాసెసింగ్ ప్రారంభించే విషయాన్ని పరిశీలించాలని జనరల్ మేనేజర్‌కు కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, హార్టికల్చర్ అసిస్టెంట్‌లు కవిత, శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా మహాచండీ హోమం


మహాచండీ హోమంలో వేదపండితులు

రామకుప్పం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండల సరిహద్దుల్లోని రాజుపేటక్రాస్‌లో గంగమ్మ ఆలయం కుంభాభిషేక మహోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం మహాచండీ హోమం ఘనంగా జరిగింది. వేదపండితులు సందీప్‌శర్మ, నాగరాజుశర్మల ఆధ్వర్యంలో వేద పండితులు ఉదయం 11.30 గంటలకు హోమాన్ని నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠ జరిగింది.

వైభవంగా పౌర్ణమి పూజలు

రామకుప్పం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని కాశీవిశ్వేశ్వరాలయంలో మంగళవారం రాత్రి పౌర్ణమి పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఆలయ అర్చకులు కృష్ణమూర్తి, హరికుమార్ స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. పిల్లిగుట్టల వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో పౌర్ణమి పూజలు జరిగాయి.

ఘనంగా బాలకృష్ణ జన్మదిన వేడుకలు



గాంధీ విగ్రహం ఎదుట కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు

చిత్తూరు సిటీ, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో, హిందూపురం ఎమ్మెల్యే, పద్మభూషణ్ నందమూరి బాలకృష్ణ జన్మదిన వేడుకలను టీడీపీ శ్రేణులు, నందమూరి అభిమానులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం నగరంలోని గాంధీ విగ్రహం ఎదుట, జిల్లా పార్టీ కార్యాలయంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుకుని బాలకృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రి చైర్మన్‌గా, కళాసేవ, ప్రజాసేవ, సామాజిక సేవా కార్యక్రమాలతో అశేష ప్రజల అభిమానాన్ని బాలకృష్ణ చూరగొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, నేతలు కాజూరు బాలాజీ, వసంతకుమార్, మోహన్‌రాజ్, సునీల్, శేషాద్రి నాయుడు, రమేష్, శశికర్ బాబు, కంద, బంగారు, ధరణి, రాజశేఖర్ పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

● ఐరాల(కాణిపాకం) (ఆంధ్రజ్యోతి): మండలంలోని అగరంపల్లె ఆర్చి వద్ద మంగళవారం నటసింహం నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు వేడుకలను ఎమ్మెల్యే మురళీమోహన్, బాలయ్య అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. బాలయ్య మరెన్నో పుట్టిన రోజులు నిర్వహించుకోవాలని కాణిపాక వరసిద్ధుడిని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గంగారపు హరిబాబు నాయుడు, మండల పోల్ మేనేజ్‌మెంట్ అధ్యక్షుడు గిరిధర్ బాబు, ఆలయ మాజీ చైర్మన్ మణి నాయుడు, మాజీ సర్పంచ్ మధుసూదన రావు, బాలయ్య అభిమానులు ఎల్బీ నాయుడు, సొప్పానాని, కిరణ్ చౌదరి, ప్రణీత్ చౌదరి, భార్గవ్ చౌదరి, భూమాయశ్వంత్, వినయ్‌చౌదరి, మురళి నాయుడు, వంశీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా హైరోడ్డు విస్తరణ పనులు

చిత్తూరు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): హైరోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. వంద అడుగుల రోడ్డు విస్తరణ పనులు కలెక్టర్ సుమిత్‌కుమార్, కమిషనర్ నరసింహప్రసాద్‌ల ఆదేశాలతో వేగంగా జరుగుతున్నాయి. చిత్తూరు-తిరుపతిరోడ్డులో కట్టమంచిలోని ద్రౌపది ఆలయం వద్ద జరుగుతున్న పనులను మంగళవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ పరిశీలించారు. పనుల వివరాలను ఏసీపీ నాగేంద్ర ఎమ్మెల్యేకు వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పురవీధుల్లో ఊరేగిన హనుమాన్ స్వామి

విజయపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోసలనగరం మిట్టూరులో మంగళవారం హనుమాన్ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. భక్తులు ఆవరణంలో పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. రాత్రి హనుమాన్ స్వామిని పురవీధుల్లో ఊరేగించారు.

4డీస్ నిర్వహణకు జిల్లాకు వాహనం కేటాయింపు



వాహనాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో సుధారాణి

చిత్తూరు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా 0-18 ఏళ్ల లోపు పిల్లల ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వం చర్యలు మొదలుపెట్టింది. ఇందుకోసం 4డీస్ అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా జిల్లాకు ఒక ప్రత్యేక వాహనాన్ని కేటాయించగా మంగళవారం జిల్లాకు వచ్చింది. ఈ వాహనాన్ని చిత్తూరు డీఎంహెచ్‌వో సుధారాణి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ త్వరలో కలెక్టర్ చేతుల మీదుగా దీనిని ప్రారంభిస్తామని తెలిపారు. 4డీస్‌లోని నాలుగు రకాల లోపాలైన పుట్టుకతో వచ్చే లోపాలు, వ్యాధులు, లోపాలు, అభివృద్ధి జాప్యాలు ఉన్న పిల్లలను ఏఎన్ఎం, ఆశా, అంగన్వాడీల ద్వారా గుర్తిస్తారన్నారు. గుర్తించిన పిల్లలను వారి ఇంటి నుంచి అవసరమైన ఏరియా, సీహెచ్‌సీ, జిల్లా ఆస్పత్రులకు తీసుకెళ్లి వైద్యం అందించి తిరిగి వారి ఇళ్లకు తీసుకెళ్లి చేర్చడమే ఈ వాహనం ముఖ్యుద్దేశమన్నారు. ఈ సేవలు త్వరలో అందుబాటులోకి వస్తాయని ఆమె తెలిపారు.

నలుగురు విద్యార్థులకు షైనింగ్ స్టార్ అవార్డులు



ప్రభుత్వ విప్ థామస్‌తో షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్న విద్యార్థులు

గంగాధరనెల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటాగరం పంచాయతీ ఎట్టేరి గ్రామంలోని శ్రీభానోదయ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో చదివిన నలుగురు విద్యార్థులు షైనింగ్ స్టార్ అవార్డులతో పాటు ప్రోత్సాహక నగదు చెక్‌లను అందుకున్నారని ఆ స్కూల్ కరస్పాండెంట్ మద్దిపట్ల నాగేశ్వర రావు, ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.మహిమ, కె.కుమార్, ఎ.జ్యోత్స్న, ఎస్.డి.జైష్ణవి ఉత్తమ మార్కులు సాధించినందుకు గాను షైనింగ్ స్టార్ అవార్డులు అందుకున్నట్లు చెప్పారు.

మాజీ ఎంపీ శివప్రసాద్‌కు టీడీపీ నేతల నివాళి



నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జూన్ 10: చిత్తూరు మాజీ ఎంపి దివంగత నారమల్లి శివప్రసాద్ జయంతి సందర్భంగా టీడీపీ నేతలు నివాళులర్పించారు. మంగళవారం శివప్రసాద్ స్వగ్రామం చంద్రగిరి మండలం, ఐతేపల్లెలో ఆయన సమాధివద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. నేతలు మాట్లాడుతూ శివప్రసాద్ ఎంపీగా జిల్లాలో అనేక అభివృద్ధి పనులు చేశారని గుర్తుచేశారు. అనేక సినిమాల్లో నటించి మంచి నటుడిగా గుర్తింపు పొందారని చెప్పారు. సామాజిక సేవా కార్యక్రమాలు చేసి ప్రజల అభిమానాన్ని పొందారని కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నేతలు వెంకటేష్ రబ్బి, సీఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పౌర్ణమి గిరి ప్రదక్షిణలు

చిత్తూరు కల్చరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): గిరింపేట వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మంగళవారం మార్గశిర మాస పౌర్ణమి పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి, విశేష అలంకారంలో ఉత్సవర్లను ప్రత్యేక రథంపై అధిష్ఠింపజేసి సీబీ రోడ్, దర్గా, ఎంఎస్ఆర్, రిలయన్స్, గిరింపేటలలో గిరిప్రదక్షిణలు నిర్వహించారు. వందలాది భక్తులు పాల్గొనగా, పలువురు దాతలు అన్న ప్రసాదాలు, మజ్జిగ, పళ్ల రసాలు, తాగునీరు తదితరాలను వితరణ చేశారు. గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో సత్యసాయి బాబాకు పల్లకి సేవను భక్తులు నిర్వహించారు. నగరంలోని కామాక్షి అంబికా సమేత అగస్థీశ్వరా, కట్టమంచి కులందేశ్వరా, గిరింపేట చిదంబరేశ్వర, రాజుగుడులలో పౌర్ణమి పూజలు జరిగాయి.

ఇంత నిర్లక్ష్యమా..?



ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణంలో తిని పడేసిన ప్లేట్లు

వెదురుకుప్పం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఇది వెదురుకుప్పం మండలం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణం. ఇక్కడ చూడండి ఎలా ఉందో. భోజనం తిన్న ప్లేట్లను ఎక్కడపడితే అక్కడ పడేయడంతో ఆవరణమంతా అపరిశుభ్రత నెలకొంది. ఆరోగ్య సూత్రాల పట్ల అవగాహన కల్పించాల్సిన ఆరోగ్య సిబ్బంది, ఉద్యోగులు ఉండే ప్రాథమిక ఆరోగ్యకేంద్ర ఆవరణమే ఇలా ఉంటే ఎలా? పరిసరాల పరిశుభ్రతకు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరారు.

టీడీపీ నేతకు ఎమ్మెల్యే పరామర్శ



లోకనాథం నాయుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

శ్రీరంగరాజపురం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబరమహారాజపురం పంచాయతీ గొల్లపల్లి చెందిన టీడీపీ జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు బోడపాటి లోకనాథం నాయుడు అన్న సుబ్రమణ్యం నాయుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ మంగళవారం బోడపాటి లోకనాథం నాయుడు, ఆనంద నాయుడు ఇంటికెళ్లి పరామర్శించారు. నాయకులు గంధమనేని రాజశేఖర్ నాయుడు, రాజేంద్ర నాయుడు, బాలాజీ నాయుడు, గుండయ్య, సుబ్రమణ్యం నాయుడు, రమేష్ నాయుడు, భాస్కర్ నాయుడు, బీగాల రమేష్, వేమ నాయుడు, పైనేని మురళి, రవి, సిద్ధయ్యశెట్టి, మాధవ నాయుడు, బ్రహ్మ నాయుడు, పుల్లూరు దాము పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

పాలసముద్రం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజ కండ్రిగకు చెందిన పురుషోత్తం వెల్డింగ్ షాపులో సోమవారం రాత్రి తమిళనాడులోని కన్నికాంబాపురం గ్రామానికి చెందిన నాగరాజు కుమారుడు జగత్‌ప్రకాష్, శ్రీనివాసన్ కుమారుడు ధనూష్ పురుషోత్తంలు ఇనుప కమ్ములను దొంగిలించడానికి దుకాణంపై ఉన్న షీట్లను తొలగించి లోపలికి వెళ్లారు. ఇనుప కమ్ములను తరలించే క్రమంలో షాపు యజమాని వెనక భాగంలో నిద్రిస్తుండగా అలికిడికి లేచి వారిని గమనించి కేకలు వేయడంతో దొంగలు పారిపోయే క్రమంలో తమ ద్విచక్ర వాహనాన్ని దుకాణానికి కొంత దూరంలో వదిలి పారిపోయారు. షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ చిన్నరెడ్డెప్ప కేసు నమోదు చేసుకుని, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరచుకున్నారు. రిజిస్ట్రేషన్ నంబరు ఆధారంగా దొంగలను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

దయ చూపు గంగమ్మా



కొత్తపల్లె గంగమ్మ జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే జగన్మోహన్

గుడిపాల, జూన్ 10(ఆంధ్ర జ్యోతి): మండలంలోని కొత్తపల్లె కాలనీలో మంగళవారం గంగమ్మ జాతరను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం మహిళలు అమ్మవారికి అంబళ్లు పోసి, పొంగళ్లు పెట్టారు. అనంతరం చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అమ్మవారిని దర్శించుకుని హారతి ఇచ్చి మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రమ్య, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, టీడీపీ నాయకులు చెన్నకేశవుల నాయుడు, బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, అనిల్‌కుమార్, మురళి నాయుడు, సుమతి, బాబు, మహదేవన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి రుణపడి ఉంటా

తన ఇబ్బందిని గుర్తించి బ్యాటరీ ట్రై సైకిల్‌ను అందించిన చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు రుణపడి ఉంటానని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చక్కెర వ్యాధి కారణంగా తన కాలికి సంబంధించి వేళ్లను తొలగించారని తెలిపారు. మండల నాయకుల సహకారంతో ఎమ్మెల్యే బ్యాటరీ ట్రైసైకిల్ పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు.

ప్రజా సమస్యలపై సీఎంకు వినతి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న సప్తగిరి ప్రసాద్

తవణంపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): వివిధ ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ మంగళవారం రాజధాని అమరావతిలో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం ఇచ్చారు. బంగారుపాళ్యం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేసి అదనంగా పది డయాలసిస్ యంత్రాలను ఏర్పాటుచేయాలని, చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో న్యూరాలజీ, కార్డియాలజీ విభాగాలను ఏర్పాటుచేసి నూతన వైద్యులను నియమించాలని, కాణిపాకం దేవస్థానంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి జీతభత్యాలు పెంచాలని కోరారు.

పాఠశాల బస్సులకు ఫిట్‌నెస్ ఉండాలి

నగరి, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పాఠశాల బస్సులు ఫిట్‌నెస్ కలిగి ఉన్నట్లు సర్టిఫికెట్లు లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని నగరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వాసుదేవరెడ్డి పేర్కొన్నారు. జూన్ 12వ తేదీన పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం అవుతుండటంతో ఆయా సంస్థల బస్సులను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ నగరిలో 25 బస్సులుండగా, ఇప్పటివరకు 12 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఉన్నాయని చెప్పారు. సర్టిఫికెట్ లేని బస్సులను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించి, యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామన్నారు.

అర్ధగిరిని దర్శించుకొన్న రాయపాటి అరుణ

తవణంపల్లె, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయాన్ని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ మంగళవారం కుటుంబ సమేతంగా దర్శించుకొన్నారు. ఆమెకు స్థానిక జనసేన నాయకులు మోహన్, చిన్న స్వాగతం పలికి స్వామి దర్శనం ఏర్పాట్లు చేశారు.

మహిళలు ధైర్యంతో ఎదగాలి

పెనుమూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): బాలికలు చిన్నతనం నుంచే ధైర్యంగా ఎదగాలని, సమాజంలో బలమైన శక్తిగా ముందుకెళ్లేలా తయారవ్వాలని ఎస్ఐ రామచంద్రయ్య సూచించారు. మంగళవారం రామక్రిష్ణాపురంలో నిర్వహించిన కిశోరి వికాసం చివరి రోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన అధికారులతో కలిసి హాజరయ్యారు. అంగన్వాడీ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, మహిళా పోలీసు ఆఫ్రీన్, సెక్రటరి సునీత, అంగన్వాడీ టీచర్లు, ఆశాలు పాల్గొన్నారు.

ప్రభుత్వం సబ్సిడీ ప్రకటించినా పల్ప్ ఫ్యాక్టరీలతో

తప్పని తిప్పలు

● దిక్కుతోచని స్థితిలో మామిడి రైతులు



కోసలనగరం మిట్టూరులో చెట్టుకే పరిమితమైన తోతాపురి, మామిడిని ట్రాక్టర్‌లో పల్ప్ ఫ్యాక్టరీకి తరలిస్తున్న రైతులు

విజయపురం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మామిడి రైతులకు సబ్సిడీ ప్రకటించినా పల్ప్ ఫ్యాక్టరీలతో తమకు తిప్పలు తప్పడం లేదని మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టన్ను తోతాపురిని రూ.12 వేలకు కొనుగోలు చేయాలని, అందులో ప్రభుత్వ సబ్సిడీ టన్నుకు రూ.4 వేలు, పల్ప్ ఫ్యాక్టరీలు టన్నుకు రూ.8 వేలకు కొనుగోలు చేయాలని మామిడి రైతులకు ఊరటనిస్తూ ప్రభుత్వం ప్రకటించింది. కానీ క్షేత్రస్థాయిలో ప్రభుత్వ హామీ నెరవేరడం లేదని మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 12 పంచాయతీల్లో సుమారు 1850 ఎకరాల్లో మామిడి సాగు చేస్తున్నారు. మామిడిని చిత్తూరుకు తరలించడానికి దూరం కావడంతో తిరుపతి జిల్లాలోని వేపగుంట, నారాయణవనం, కేవీబీపురం ప్రాంతాల్లోని పల్ప్ ఫ్యాక్టరీలకు రైతులు తరలిస్తున్నారు. పల్ప్ ఫ్యాక్టరీల యాజమాన్యం ఇష్టానుసారం చెబుతుందని, టన్ను తోతాపురికి రూ.8 వేలు ఇవ్వలేమని, రూ.6 వేలు చెల్లిస్తామని, ఇష్టం ఉంటే తోలండి లేదా మానుకోండి అంటున్నారని రైతులు వాపోతున్నారు. మామిడి పంట ఇంకా 10 రోజుల్లో పూర్తి అయిపోతుందని, వర్షం పడడం వలన ఎక్కువగా రాలిపోతున్నాయని, అధికారులు మామిడి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

మామిడి రైతులు ఆర్‌ఎస్‌కేల వద్ద

పేర్లు నమోదు చేసుకోవాలి: కలెక్టర్



జైన్‌ఫ్యాక్టరీ జీఎం దిలీప్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

గంగాధరనెల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): పల్ప్ ఫ్యాక్టరీలకు తోతాపురి మామిడి కాయలను తోలే రైతులు తమ పేర్లను రైతుసేవాకేంద్రం ఇన్‌చార్జిల వద్ద నమోదు చేసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. గంగాధరనెల్లూరు పంచాయతీ 100 గొల్లపల్లె వద్ద గల జైన్‌ఫ్యాక్టరీని మంగళవారం రాత్రి అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన తోతాపురి మామిడి టన్ను రూ.12వేలులో పల్ప్ ఫ్యాక్టరీ నిర్వాహకులు ఖచ్చితంగా రైతులకు రూ.8వేలు చెల్లించాలని ఆదేశించారు. మిగిలిన రూ.4వేలును ప్రభుత్వం రైతుల ఖాతాలకు జమ చేస్తుందని చెప్పారు. తూగుండ్రంకు వెళ్లే రహదారి పక్కన ఉన్న జైన్ ఫ్యాక్టరీ రెండవ యూనిట్‌లో సైతం పల్ప్ ప్రాసెసింగ్ ప్రారంభించే విషయాన్ని పరిశీలించాలని జనరల్ మేనేజర్‌కు కలెక్టర్ సూచించారు. జాయింట్ కలెక్టర్ విద్యాధరి, జిల్లా ఉద్యానవన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి, ఆర్డీవో శ్రీనివాసులు, ఇన్‌చార్జి తహసీల్దార్ తులసీరామ్, జిల్లా మామిడి రైతుల యూనియన్ గౌరవ అధ్యక్షుడు వెంకటరెడ్డి, వీఆర్వోలు భాస్కర్, హరిప్రసాద్‌రెడ్డి, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్‌లు కవిత, శివకుమార్ పాల్గొన్నారు.

గంగ జాతరల సందడి



వెంగళరావు కాలనీ గంగజాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సీకే బాబు తదితరులు

చిత్తూరు కల్చరల్, జూన్ 10(ఆంధ్ర జ్యోతి): వరస గంగజాతర్లతో చిత్తూరు నగరం మంగళవారం హోరెత్తింది. వెంగళరావు కాలనీ, తేనెబండ, శ్రీనివాసపురం, వైఎస్సార్ కాలనీ, గుడిసె గుండ్లు తదితర ప్రాంతాల్లో నడి వీధి గంగమ్మలను నిలిపి గంగ జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. స్థానికులు అమ్మవార్లకు పొంగళ్లు పొంగించి, అంబలి నైవేద్యం సమర్పించి, జంతు బలులు ఇచ్చి పూజలుజేశారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, మాజీ ఎమ్మెల్యే సీకే బాబులు తమ అనుచర బృందంతో తేనెబండ, శ్రీనివాసపురం, వెంగళరావుకాలనీల నడివీధి గంగజాతర్లలో పాల్గొని అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఉత్సవాల నిర్వాహకులు అమ్మవార్ల పూజలకు ఏర్పాట్లు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. బుధవారం అమ్మవార్లకు భక్తులు మహాకుంభ నైవేద్యాలు సమర్పించి జలప్రవేశాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

డీఎంహెచ్‌వో తనిఖీలు

చిత్తూరు రూరల్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): చిత్తూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలోని వివిధ సెక్షన్లను డీఎంహెచ్‌వో సుధారాణి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టోర్స్, టాయిలెట్స్ వివిధ సెక్షన్లలో మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమైన సెక్షన్లకు ఇన్వర్టర్లు, కంపూటర్లు, ప్రింటర్లు అవసరమని ఇటీవల కార్యాలయం తనిఖీకి వచ్చిన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి వాటిని మంజూరు చేసినట్లు తెలిపారు. అందులో భాగంగానే త్వరలో టాయిలెట్ల మరమ్మతులు, కార్యాలయానికి పెయింట్ వేయనున్నట్లు చెప్పారు. శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని ముందుగా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎప్పటికప్పుడు వచ్చే మందులు, ఇతర వస్తువులను ఆయా పీహెచ్‌సీలకు తరలించేయాలని ఆదేశించారు.

నాలుగు రోజులపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంగాధరనెల్లూరు, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): గంగాధరనెల్లూరు మండలం పెద్దకాల్వ పంచాయతీ ఎల్లమరాజుపల్లె (ఠాణా చెక్‌పోస్ట్) వద్ద గల సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేస్తున్నందున పగటిపూట నాలుగురోజులపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చిత్తూరు విద్యుత్‌శాఖ ఈఈ సురేష్‌కుమార్, గంగాధరనెల్లూరు ఏఈ వరదరాజులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లమరాజుపల్లె వద్ద గల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఈనెల 11, 12, 13, 14వ తేదీల్లో ప్రతిరోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటలకు వరకు మరమ్మతులు చేస్తున్నందున విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతున్నందని అన్నారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని ఠాణా, ఎల్లమరాజుపల్లె, చెర్లోపల్లె, చెర్లోపల్లె దళితవాడ, వేల్కూరు, పి.బి.అగ్రహారం, చిత్తూరు రూరల్ మండలం పరిధిలోని బంగారెడ్డిపల్లె, శెట్టిగారిపల్లె, కొత్తూరు, ఎగువ మాసాపల్లె గ్రామాలకు చెందిన ప్రజలకు నాలుగురోజులపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని వారు కోరారు.

ఈఏపీ సెట్‌లో పీఎస్ఎన్ విద్యార్థుల సత్తా



పీఎస్ఎన్ శ్రీవివేకానంద విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఈఏపీ సెట్ ఫలితాల్లో స్థానిక పీఎస్ఎన్ శ్రీవివేకానంద విద్యార్థులు సత్తా చాటి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారని కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ నాగరాజశెట్టి తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో పి.సాహితి రాష్ట్ర స్థాయిలో 1338 ర్యాంకు సాధించి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచారన్నారు. కె.తేజరెడ్డి (1648) ర్యాంకు సాధించగా, ఎం.గణేష్ (2736), పి.అనీష్ (3559), ఆర్.మాన్యత (3636), కె.పవన్ కళ్యాణ్ (5022), కె.లిఖిత (5214), పి.దిలీప్ (5461), కె.మహితకీర్తి (6178), వి.తేజేష్ (6966), డి.స్నేహ (7159), ఎస్.మోనిక (7201), యోహిత్‌సాయి (7225), పల్లవి (7303) ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వీరిని కళాశాల యాజమాన్యం అభినందించారు.

శ్రీవివేకానంద విద్యార్థుల ప్రతిభ



శ్రీవివేకానంద విద్యార్థులు

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఈఏపీ సెట్ ఫలితాల్లో స్థానిక శ్రీవివేకానంద విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ భాస్కర్ నాయుడు, మహేంద్రకుమార్ తెలిపారు. కె.తరుణ్‌కుమార్ (2145) రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించగా, కె.హేమేశ్వర్ (4851), కె.రాకేష్ (7126), పి.గాయత్రి (8593), నిర్మల్‌కుమార్ (10,277), పి.బాలు(11373), షషాంక్ (11508) ర్యాంకులు సాధించారన్నారు. వీరిని కళాశాల యాజమాన్యం అభినందించారు.

జీవో ప్రకారం టెక్నికల్, నాన్ టెక్నికల్ సిబ్బందికి జీతాలు ఇవ్వాలి

చిత్తూరు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నగరపాలక, పురపాలక, నగర పంచాయతీల్లో ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వ జీవో ప్రకారం టెక్నికల్, నాన్‌టెక్నికల్ సిబ్బందికి వేతనాలను ఇవ్వాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మధుబాబు, ప్రధానకార్యదర్శి గంజి రామ్మూర్తి, ఇతర నేతలు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కమిషనర్ నరసింహ ప్రసాద్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఇచ్చారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ ల్లోని ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న టెక్నికల్ సిబ్బందికి నెలకు రూ.29,200, నాన్ టెక్నికల్ సిబ్బందికి రూ.24,000 వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. కమిషనర్‌ను కలిసిన వారిలో ఆ సంఘ నేతలు శరవణ, శివకుమార్, శివప్రసాద్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరిగాయి: వైసీపీ



నిరసన తెలుపుతున్న వైసీపీ మహిళా విభాగం నాయకులు

చిత్తూరు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఏడాది కూటమి పాలనలో మహిళలపై అత్యాచారాలు, దౌర్జన్యాలు పెరిగాయని వైసీపీ మహిళా విభాగం నాయకులు తెలిపారు. మంగళవారం చిత్తూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా సందర్భంగా మహిళా విభాగం అధ్యక్షురాలు అంజలిరెడ్డి మాట్లాడుతూ చిన్నపిల్లలపై అత్యాచారాలు జరుగుతున్నా పోలీసులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారన్నారు. నగరపార్టీ అధ్యక్షులు కేపీ శ్రీధర్, మాజీ ఎమ్మెల్యే లలితకుమారి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సరళామేరీ, నాయకులు గాయత్రిదేవి, హరిణిరెడ్డి, గౌహతిరెడ్డి, ద్రాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

దిశ చట్టం అమలులో ప్రభుత్వం విఫలం

● మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చిత్తూరు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): దిశ చట్టాన్ని అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, దాంతో రాష్ట్రంలో నిత్యం ఏదో ఓ చోట మహిళలు, యువతులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం వైసీపీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి విజయానందరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమంగా ఇసుక, మద్యం ఏరులై పారుతుందన్నారు. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను ఎత్తి చూపుతున్న సాక్షి మీడియాను అణగదొక్కాలని అధికార పార్టీ కుట్ర చేస్తోందన్నారు. వైసీపీ నాయకురాళ్లు గాయత్రీదేవి, గౌహతిరెడ్డి, హరిణిరెడ్డి, అంజలిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర ప్రారంభం

వెదురుకుప్పం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం గ్రామ దేవత గంగమ్మ జాతర మంగళవారం భక్తిశ్రద్ధలతో ప్రారంభించారు. టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గోవిందరాజులు అమ్మవారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు.

● వెదురుకుప్పం మండలం దామరకుప్పంలో భక్తిశ్రద్ధలతో గంగమ్మ తిరుణాళ్ల ప్రారంభమయ్యాయి.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టుకు గాయాలు



గాయపడిన భాస్కర్

వెదురుకుప్పం, జూన్ 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ స్కూటరిస్టు తలకు తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం రాత్రి కార్వేటినగరం మండలంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కార్వేటినగరంలోని బోయలబావి వీధికి చెందిన భాస్కర్(40) పుత్తూరు వైపు నుంచి కార్వేటినగరంకు మంగళవారం రాత్రి వస్తుండగా ఇదే మండలంలోని పద్మసరస్సు గ్రామ సమీపంలో చిత్తూరు-పుత్తూరు జాతీయ రహదారిలో ప్రమాదం జరిగింది. అదుపు తప్పి బైక్ ప్రమాదానికి గురైనట్లు చెప్పారు. గాయపడిన భాస్కర్‌ను చికిత్స నిమిత్తం కార్వేటినగరం ప్రభుత్వాస్పత్రికి తరలించారని తెలిపారు. ఈ విషయమై కార్వేటినగరం పోలీసులకు ఫిర్యాదు అందలేదన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించండి

ఐరాల, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఐరాల మండల డీలర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘ మండల అధ్యక్షురాలు ఎల్.మాధవీలత ఎమ్మెల్యే మురళీమోహన్‌కు విన్నవించారు. మంగళవారం చిత్తూరులోని ఎమ్మెల్యే నివాసంలో ఆమె మాట్లాడుతూ రాజీనామా చేసిన పాత డీలర్లు పాత బియ్యం కొరతను అలానే ఉంచారని తెలిపారు. ఈ సమస్య మండలంలోని అన్ని చౌక దుకాణాల్లో ఉందని చెప్పారు. ఉన్నతాధికారుల దృషికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని సమర్పించారు.

వైభవంగా గంగ జాతర వేడుకలు

పాలసముద్రం, జూన్ 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలసముద్రంలో మంగళవారం గంగ జాతర వేడుకలను గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం గ్రామస్తులు గెరగను ఊరేగించి అంబళ్లు పోశారు. సాయంత్రం మహిళలు ఆలయం వద్ద పొంగళ్లుపెట్టి మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మను ఊరేగింపుగా తీసుకొచ్చారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు.

ఆటో చోరీ

చిత్తూరు అర్బన్, జూన్ 10(ఆంధ్రజ్యోతి): ఇంటి వద్ద ఉంచిన ఆటోను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సీఐ నెట్టికంఠయ్య కథనం మేరకు.. నగరంలోని దుర్గానగర్‌కాలనీకి చెందిన వెంకటేశ్ కుమారుడు మూర్తి తన ఆటోను ఈ నెల 6వ తేదీన ఇంటి బయట ఉంచి పడుకున్నాడు. మరుసటి రోజు ఉదయం చూస్తే కనపడలేదు. దాంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.